
ప్రజలే ప్రభువులు

# జనబలం

జనవరి 2024 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10 /-






## 2024 కీలక ఎన్నికల ప్రశ్న

## హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి

## ప్రజాస్వామ్య పరిరక్షణకు నిజమైన ఎన్నికల సంస్కరణ

## చట్టసభల్లో యువ నాయకత్వం

## తెలంగాణ ఎన్నికలు - పౌర సమాజం




## మీడియా సమాజాన్ని చైతన్య పరిచే ఆయుధం కావాలి




సమాజాన్ని చైతన్యపరిచే ఆయుధంగా మీడియా ఎప్పుడూ మంచి వైపే ఉండాలని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. మోహనరాగం వెయ్యి ఎపిసోడ్‌లు పూర్తి చేసుకున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.



ఇప్పటి మీడియా డిజిటలైజేషన్ ద్వారా కొత్త పద్ధతులు వెతుక్కుంటోందని, అలా రూపొందించిన స్వర మీడియా నిర్వాహకులు రాజేష్, బండారు రామ్మోహన్‌రావు, విశ్వేశ్వరరావులు అభినందనీయులని జేపీ అన్నారు. మన మాటల ద్వారా సమాజానికి ఏదైనా ఉపయోగం ఉందంటే వారు మాట్లాడాలని, సమాజానికి నష్టం కలిగించేవారు మౌనంగా ఉండటమే మంచిదని అన్నారు. ఈ కార్యక్రమానికి రామ్మోహన్ రావు అధ్యక్షత వహించారు. మాభూమి దర్శకులు బి నర్సింగరావు , హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ, కోమండూరి రామాచారి, ధ్యానపల్లి సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, హరిత పవన్ తదితరులు పాల్గొన్నారు. కవులు కళాకారులను సన్మానించి మెమొంటోలు అందజేశారు.



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి **25** సంచిక **01**

జనవరి **2024**


**సంపాదకవర్గం**

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

**వర్కింగ్ ఎడిటర్**

దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యాయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# స్వేచ్ఛాయుత పారదర్శక ఎన్నికలే ప్రజాస్వామ్యానికి కీలకం!

**సంపాదకీయం**

ఆంధ్రప్రదేశ్ సహా పన్నెండు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల స్పెషల్ సమ్మరీ రివిజన్ జనవరిలో ముగియ నున్నది. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భారత ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను విస్తృతంగా చేపట్టింది. ప్రజాప్రాతినిధ్య చట్టప్రకారం స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగడానికి లోపాలు లేని ఓటర్ల జాబితాల రూపకల్పన అత్యంత కీలకం!

ఎన్నికల కమిషన్ గానీ, రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులుగానీ, ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు గానీ తమ రాజ్యాంగబద్ధ బాధ్యతలను సందేహాలకు అతీతంగా నిర్వహించడాన్ని ఒక పవిత్ర కర్తవ్యంగా భావిస్తుంటారు.తమ బాధ్యతలపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల అక్కడక్కడా జరిగే పొరపాట్లు తప్ప ఉద్దేశ్యపూర్వకంగా ఎన్నికల ప్రక్రియలో తప్పులు చేసే సందర్భాలు మన దేశంలో దాదాపు లేనేలేవని చెప్పొచ్చు. రాజకీయాలకు అతీతంగా పనిచేసే విషయంలో భారత ఎన్నికల కమిషన్‌కు, ఎన్నికల యంత్రాంగానికి ప్రశంసాపూర్వకమైన గత చరిత్ర ఉన్నది. మనదేశంలో ఎన్నికల ప్రక్రియలో ధనబలం, కండబలం, మద్యం పంపిణీ, కుల, మత ప్రాంతీయ భావోద్వేగాలు, వంటి లోపాలు ఎన్నో ఉన్నమాట నిజమే. అయినప్పటికీ మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఇన్నేళ్ళుగా సజావుగా మనగలగడానికి మన ఎన్నికల యంత్రాంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా పనిచేయడం ఒక ప్రధాన కారణం అని చెప్పాలి.

గత కొద్ది దశాబ్దాలుగా ఎన్నికల కమిషన్ పని తీరును ప్రభావితం చేయడానికి పాలకులు గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నారని కూడా మనకు తెలుసు. గతంలో కొందరు అధికారులు ప్రభావాలకు లోనయిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. అలాగే సర్వస్వతంత్రంగా వ్యవహరించే అధికారులను కూడా చూశాం! ఎన్నికల కమిషన్ సభ్యుల నియామకంలో ప్రభుత్వాధినేతలు రాజకీయ పక్షపాతాలకు తావు ఇస్తున్నారన్న భావన ఇటీవల బలపడుతోంది. భారత ఎన్నికల కమిషనర్ ఎంపిక కమిటీ నుండి సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిని తొలగించి కేంద్రమంత్రిని సభ్యుడిగా నియమించేందుకు వీలుగా తాజాగా చేసిన చట్టసవరణ పాలకపక్ష ప్రయోజనాల కోసమేనన్న విమర్శ సహేతుకమే అని చెప్పాలి.

**2019** సాధారణ ఎన్నికల్లో పోలింగురోజు ఈవీఎమ్‌లను సీలు చేసినప్పుడు నమోదు చేసిన మొత్తం ఓట్ల సంఖ్యకు, లెక్కింపు రోజున నోటా సహా వివిధ అభ్యర్థులకు పడిన మొత్తం ఓట్ల సంఖ్యకు పెద్ద ఎత్తున వ్యత్యాసాలు కనిపించాయి. వాటిని పరిగణనలోకి తీసుకోకుండానే ఫలితాలు ప్రకటించడం జరిగింది. దానిపై అప్పట్లోనే కొన్ని స్వచ్ఛంద సంస్థలు, మీడియాసంస్థలు పలు నియోజకవర్గాలలో తులనాత్మక పరిశీలన చేసి ఎన్నో లోపాలు జరిగినట్లుగా కనుగొన్నాయి.

అప్పట్లో పార్లమెంటులో ప్రాతినిధ్యం కలిగిన **22** రాజకీయ పక్షాలు ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్ళి దీనిపై అభ్యంతరం చెప్పాయి. ఇలాంటి ఫిర్యాదులు ఉన్న అభ్యర్థులు కోర్టులకెళ్లి ఎన్నికల కేసులు వేసుకోవాలని ఈసీ సలహా ఇచ్చింది. రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. తేడాలు ఎందుకు వచ్చాయన్న సందేహం ఇప్పటికీ అలాగే ఉండిపోయింది.

ఈవీఎంలపై వివాదం కూడా అలాగే మిగిలిపోయింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను హ్యాక్ చేయవచ్చునని, టాంపర్ చేయవచ్చునని బలమైన వాదన ముందుకు వచ్చింది. ఎన్నికల కమిషన్ అధికారుల సమక్షంలో జరిగిన డెమోలో ఒక సాంకేతిక నిపుణుడు ఓటింగ్ యంత్రాన్ని టాంపర్ చేసి చూపించారు.అయితే ఆయన సొంతంగా తెచ్చిన ఓటింగ్ యంత్రం కాబట్టి దాని ప్రోగ్రామింగ్ లో అలాంటి అవకాశాన్ని ఆయనే ఏర్పాటు చేసి ఉంటారని ఎన్నికల కమిషన్ అధికారులు అన్నారు.

తాజాగా ఏపీలో ఓటర్ల జాబితాల తయారీలో లోపాలు జరిగాయన్న ఫిర్యాదులు చాలా ఎక్కువగా వచ్చాయి. ఓ ఎంపీ రాసిన లేఖకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమాధానం ఇస్తూ ఏపీలో ఒకే ఇంటి నంబరుతో పదికి మించి ఓట్లు ఉన్న గృహాల సంఖ్య సుమారు ఒక లక్షా యాభై వేలనీ, అందులో నమోదైన ఓట్లు సుమారు **25** లక్షలు ఉన్నాయనీ తెలిపారు. కనీసం ఇంటి నంబరు గానీ, చిరునామా గానీ లేకుండా చేర్చిన ఓట్లు కూడా సుమారు రెండున్నర లక్షలు వరకూ ఉన్నాయని తెలిపారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇలాంటి ఓట్లు **50** వేలవరకూ ఉన్నట్లు వెల్లడి అయ్యింది.

పెద్ద సంఖ్యలో నిజమైన ఓట్లను తొలగించడానికి మూకుమ్మడిగా ఫారం **7** దాఖలు అయినట్లు ప్రధాన రాజకీయపక్షాలు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు కూడా పలుసార్లు ఏపీలో పర్యటించారు. మరోసారి జనవరిలో పర్యటిస్తున్నారు. దీనిపై వివిధ రాజకీయ పక్షాల, పౌర సమాజ సంస్థల ఆందోళన తర్వాత వాటిని సరిదిద్దే చర్యలు చేపట్టినా సమ్మరీ రివిజన్ సమయానికి ఇంకా సగం పైగా పని మిగిలే ఉందని అవగతం అవుతోంది.


ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో, వలంటీర్ల సహాయంతో ఓటర్ల జాబితాల తయారీ చేయించడం వల్ల పెద్ద ఎత్తున పొరబాట్లు జరిగాయని తేలింది. వారికి ఆ పనిలో ఏమాత్రం అనుభవం లేదు. దశాబ్దాలుగా ఓటర్ల జాబితాల తయారీలో పాలు పంచుకుంటూ అనుభవం కలిగిన ఉపాధ్యాయులను, ఇతర శాఖల సిబ్బందిని రాష్ట్రప్రభుత్వం ఆ కార్యక్రమానికి దూరంగా ఉంచింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల వ్యవస్థ నేరుగా అధికారపార్టీ కార్యకలాపాల్లో పాలుపంచుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన **7**వ నంబరు జీఓ వివాదాస్పదం అయ్యింది. రెండేళ్ళ క్రితం జరిగిన స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో జరిగిన హింసాకాండ రాజకీయపార్టీల మధ్య తీవ్ర వైమనస్య వాతావరణాన్ని సృష్టించింది. రానున్న సాధారణ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరగాలని ఆంధ్రప్రదేశ్‌లోని పౌరసమాజం గట్టిగా కోరుకుంటోంది. లోక్‌సత్తా, ఏ.డి.ఆర్. వంటి సంస్థలు చిరకాలంగా ఈదిశగా చేస్తున్న కృషి పౌరసమాజ ఆదరణ పొందటం తెలిసిందే.

ఇటీవల ఏపీలో పలువురు విశ్రాంత సివిల్ సర్వీసు ఉన్నతాధికారులు, విశ్రాంత న్యాయమూర్తులు, విద్యావేత్తలు, వయోధిక సామాజిక కార్యకర్తలు “సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ” పేరిట చేపట్టిన కార్యకలాపాలు చిరకాలంగా లోక్‌సత్తా ఉద్యమసంస్థ చేస్తున్న ఆలోచనలను, నినాదాలను ముందుకు తీసుకువెళ్ళడం హర్షణీయం. పౌరసమాజం గట్టిగా నిలదీసిన నాడే వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయి. ఆ దిశగా ఆంధ్రప్రదేశ్‌లో పౌరసమాజవాణి బలంగా వినిపిస్తుందని ఆశించవచ్చు.

డి. సోమసుందర్

# అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకానికి అన్వేషణ

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



మన ఉమ్మడి అవసరాల్ని తీర్చటానికి మానవ సమాజం ప్రభుత్వాలను సృష్టించింది. ప్రజాస్వామ్య సమాజంలో ప్రభుత్వాలు మన ద్వారా ఎన్నికవుతాయి. అయితే మనం, ప్రజలం ప్రభుత్వాన్ని ఎందుకు సృష్టించుకున్నామో ఆ లక్ష్యాన్ని పణంగా పెట్టి మనల్ని తాత్కాలికంగా సంతృప్తి పరచాలనే ఉబలాటం ఎన్నికల్లో పోటీ చేసేవారికి ఎప్పుడూ ఉంటుంది. మన సమాజంలో పేదరికం, అసమానత పెద్దఎత్తున ఉన్నాయి. కానీ పేదరికం బాధని తాత్కాలికంగా తగ్గించటం, ఓటర్లని సంతృప్తిపరచటం కోసం ప్రభుత్వాలు కేవలం తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమం మీదే దృష్టి పెడితే, మనం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం సమాజ ఉమ్మడి అవసరాలను నిర్లక్ష్యం చేస్తే, బాగా నష్టపోయేది, బాధలు పడేది పేదలే. ప్రభుత్వం తాను నిర్వర్తించాల్సిన మౌలిక బాధ్యతల్లో విఫలమైతే, ఆర్థిక రంగం పెరగదు, పేదరికం కొనసాగుతుంటుంది. వేగంగా ఆర్థికాభివృద్ధి జరగటమే పేదరికానికి అతి పెద్ద విరుగుడు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు ఆర్థిక రంగాన్ని నిరంతరాయంగా పరుగులెత్తించబట్టే చైనా పేదరికాన్ని నిర్మూలించగలిగింది. భారతదేశం ఒక మాదిరి వృద్ధి రేటు 5% సాధించినా కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారు. దీర్ఘకాల అభివృద్ధి, ఉమ్మడి అవసరాలను తాత్కాలిక సంక్షేమ చర్యలతో సమతూకపరచటమే వచ్చే మూడు దశాబ్దాలపాటు మన ముందున్న అతి పెద్ద సవాలు.

ఆర్థికాభివృద్ధికి పటిష్ఠ నాణ్యతా ప్రమాణాలున్న మౌలిక వసతులు, నైపుణ్యాలు, ఆరోగ్యం, వివాదాలను నిష్పాక్షికంగా, శాంతియుతంగా పరిష్కరించేందుకు, మన హక్కులను పరిరక్షించేందుకు చట్టబద్ధపాలన, పెట్టుబడులకు ప్రోత్సాహం, ఉపాధి కల్పనకు ప్రోత్సాహకాలు, అర్థవంతమైన పన్ను విధానాలు అవసరం. మన వనరులన్నీ రోజువారీ మనుగడకు, తాత్కాలిక సంక్షేమానికే పోతే ఆర్థిక రంగం నిలిచిపోతుంది, అభివృద్ధి ఉండదు. అభివృద్ధి లేకుండా, పెరుగుతున్న జనాభాతో, మనం మరింత పేదలమవుతాం. అభివృద్ధి ఉంటే సంక్షేమంపై ఖర్చుకి ప్రభుత్వానికి మరిన్ని పన్నుల ఆదాయాలుంటాయి. అభివృద్ధి, సంక్షేమం కలసికట్టుగా సాగాలనేది సుస్పష్టం.

సంక్షేమంతో కూడిన అభివృద్ధిని పెంచాలంటే, రెండు ప్రధాన ప్రశ్నలకు సమాధానం అవసరం. మొదటిది, సంక్షేమంపై మనం ఎంత ఖర్చు చేయగలం; రెండోది, పేదలకు సాయపడటానికి ఏ రకమైన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలి. ప్రభుత్వానికి ఆదాయం మూడు వనరుల నుంచి వస్తుంది: మొదటిది, పన్ను ఆదాయాలు, సెస్సులు, ప్రజల నుంచి ప్రభుత్వం వసూలు చేసే ఫీజులు; రెండు, పెట్టుబడుల నుండి వచ్చే డివిడెండ్లు, ఆదాయం, ఆస్తుల అమ్మకం; మూడోది, అప్పులు. అప్పు తెచ్చిన డబ్బుని, పెట్టుబడి లాభాల్ని, ఆస్తుల అమ్మకాల్ని మనం రోజువారీ ఖర్చులకే వినియోగిస్తే, అప్పుల ఊబిలో కూరుకుపోతాం. తొందరలోనే ప్రభుత్వాలు దివాలా తీస్తాయి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. విజ్ఞత గల కుటుంబాలు, కంపెనీలు, ప్రభుత్వాలు రోజువారీ ఖర్చును ప్రస్తుత ఆదాయాల నుంచే నిర్వహిస్తాయి. వీలైనంత ఎక్కువ డబ్బును పొదుపు చేస్తాయి. కానీ ప్రభుత్వంలో మాత్రం అప్పు తెచ్చిన డబ్బు, సంపద సృష్టించే పెట్టుబడులకు కాకుండా రోజువారీ వినియోగానికి వెళ్తోంది. దీనివల్ల ఎటువంటి అదనపు అభివృద్ధి, ఆదాయం లేకుండా భవిష్యత్తు మీద అప్పుల భారం పెరుగుతోంది. ఇది ప్రమాదకరమైన పరిస్థితి.


మనం ఖర్చును తగ్గించగలమా? చాలా రాష్ట్రాల్లో, జీతాలు, పెన్షన్లు, వడ్డీల చెల్లింపులు ఇప్పటికే సొంత ఆదాయాలను మించి ఉన్నాయి. దీంతోపాటు, రోజువారీ పరిపాలనా ఖర్చు. ఈ మొత్తం వ్యయాలను ఎవరూ ఆపలేరు. ఏ ప్రభుత్వమూ రాత్రికిరాత్రి వాటిని తగ్గించలేదు. ఆ తర్వాత మనకు తాత్కాలిక సంక్షేమ వ్యయం ఉంటుంది. ఈ వ్యయాన్ని కూడా ఒక పరిధిలోకి తేవటం అవసరం. కానీ ప్రతి ఎన్నికలో కొత్త తాత్కాలిక సంక్షేమ పథకాలు, వేగంగా పెరిగే జీతాలు, వాటికి అనుగుణంగా ఎటువంటి బడ్జెట్ కేటాయింపులు లేకుండా నిరంతరం భారీగా పెరుగుతూ భవిష్యత్తుపై విపరీత భారం వేసే పెన్షన్లు, వెరసి యూనియన్ ప్రభుత్వం నుంచి బదిలీ అయ్యే

నిధులతో కలిపినా ఖర్చు చాలా రాష్ట్రాల్లో ఆదాయాల్ని మించి పోయింది. జాతీయ స్థాయి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి. జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, రాష్ట్రాలకు చేసే అన్ని రకాల బదిలీలు, సంక్షేమ పథకాలు పోగా 2022-23లో (సవరించిన అంచనాలు) రూ.11,10,546 కోట్లు, 2023-24లో (బడ్జెట్ అంచనాలు)లో రూ.8,69,855 కోట్లు భారీ రెవెన్యూ లోటు ఉంది. మన ప్రభుత్వాలు నేల విడిచి సాము చేస్తున్నాయి. ఉద్యోగి సర్వీసులో రూపాయి జమ చేయకుండా నిరంతరం భారీగా పెరుగుతుండే పెన్షన్ పథకాలు (ఓపీఎస్), సంక్షేమం పేరుతో బాధ్యతారహిత పథకాలు మన దేశాన్ని దివాలా తీయిస్తున్నాయి. ఓపీఎస్ వల్ల ప్రమాదాన్ని గుర్తించటం వల్లే 2004 నుంచి కొత్త జాతీయ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చారు. ఇందులో ఉద్యోగులు, ప్రభుత్వం సర్వీసులో ఉన్నప్పుడే నెలనెలా కొంతమొత్తం తమ వంతు వాటాగా చెల్లిస్తారు. అయితే అంతకు ముందున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తిస్తుంది కాబట్టి 2035-40 వరకు ఓపీఎస్ భారం భారీగా పెరుగుతూనే ఉంటుంది; ఆ తర్వాత కూడా మళ్లీ ఓపీఎస్ అమలు చేస్తామనే ప్రభుత్వాలున్న రాష్ట్రాలు 2035 తర్వాత దారుణంగా పతనమవటం ఖాయం.

కాబట్టి, భవిష్యత్తులో చెల్లించే పెన్షన్లు, సంక్షేమ పథకాలు సహా రోజువారీగా ప్రభుత్వం చేసే ఖర్చు మొత్తం ఈవేళ ప్రభుత్వానికి వచ్చే ఆదాయాల నుంచే తప్ప అప్పులు, ఆస్తుల అమ్మకం నుంచి చేయకూడదనేది నిబంధన కావాలి. సంక్షేమ పథకాలకు ఈవేళ్టి ఆదాయం నుంచి ఖర్చు చేస్తూ, అప్పు తెచ్చిన డబ్బు భవిష్యత్తు అవసరాల పెట్టుబడులకు వినియోగిస్తుంటే, అప్పుడు భవిష్యత్తు అభివృద్ధి, రోజువారీ సంక్షేమం మధ్య సమతూకం నెలకొంటుంది.

ఇక రెండో ప్రశ్న: ఏ రకమైన సంక్షేమ కార్యక్రమాలు ప్రయోజనకరం? ఉత్పాదకతను, సంపాదించే శక్తిని పెంచే ఏ రకమైన సంక్షేమ కార్యక్రమమైనా సరైనదే. నైపుణ్యాల పెంపు, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రోత్సాహకాలు ఇవ్వటం ఇందుకు మంచి ఉదాహరణలు. ఆ తర్వాతి అత్యుత్తమ కార్యక్రమం పేదల ఆదాయాలకు అదనపు తోడ్పాటు ఇవ్వటం. లక్ష్యానికి కచ్చితంగా విరుద్ధ ఫలితాలనిచ్చే సంక్షేమ పథకాలు వ్యక్తులకు తాత్కాలిక లబ్ధి కలిగిస్తాయి గానీ, ఆర్థిక వ్యవస్థకు, ఉత్పాదకతకు దీర్ఘకాలంలో నష్టాన్ని కలిగిస్తాయి. ఫలితంగా, పేదలకు ఉద్దేశించిన లాభం కంటే సమాజం భరించే నష్టం, మూల్యం ఎక్కువగా ఉంటాయి.

ఉదాహరణకు, సంక్షేమం ఏ రకంగా ఉండకూడదో ఆ రకంగా అమలు చేసే రుణమాఫీల కార్యక్రమం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే రైతులు, సూక్ష్మ తరహా సంస్థలు కేవలం 30-40%; మిగిలిన వాళ్లు అనధికార వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పు తెచ్చుకుంటారు. కాబట్టి, ఏ రకమైన రుణ మాఫీ అయినా 60% రైతులు, చేతివృత్తులవారికి వర్తించదు. నిజాయతీగా సకాలంలో రుణం చెల్లించినవారికి రుణమాఫీ




లాభం వర్తించదు. మోసపోయామన్న భావం వారికి కలుగుతుంది. అంతిమంగా అప్పులు ఎగ్గొట్టే సంస్కృతిని మనం సృష్టిస్తున్నాం. చివరికి మొత్తం పరపతి నాశనమై, రైతులు, చేతివృత్తులవారి పరిస్థితి మరింత దిగజారుతుంది. అందువల్లే ప్రజల పన్నుల డబ్బుతో ఎన్ని రుణమాఫీలు చేసినా పేదలు, అట్టడుగు వర్గాలు పేదరికంలో మగ్గుతూ ఉంటారు. రుణమాఫీలకు బదులుగా, సకాలంలో, అవసరమైన మొత్తంలో రుణాల్ని అందుబాటులోకి తేవటం, గడువులోగా చెల్లించినవారికి వడ్డీ రాయితీలు, ఉత్పాదకతను పెంచటానికి సాంకేతికత, మెరుగైన ధర లభించటానికి మంచి మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు ఆదాయాల్ని పెంచుతాయి, ప్రజలను పేదరికం నుంచి బయటపడేస్తాయి.

మీటర్లు లేకుండా రైతులకు ఉచిత విద్యుత్తు, పౌష్టికాహార సమతుల్యత లేకుండా ఉచిత బియ్యం, గోధుమల పంపిణీ, మొక్కల పోషకాలతో సమతౌల్యం లేకుండా యూరియా సబ్సిడీ పేదరిక నిర్మూలనకు దోహదం చేయవు; ఆ దిశగా నిజమైన దీర్ఘకాల ప్రభావం చూపకపోగా సమాజం, పర్యావరణంపై విపరీత భారం మోపే సంక్షేమ పథకాలకు అవి కొన్ని ఉదాహరణలు.

మన విధానాలు, సంక్షేమ చర్యలు పేదరికాన్ని అంతం చేసి, ప్రజలందరినీ మధ్యతరగతి పరిధిలోకి తీసుకురావాలి. వారి ఉత్పాదకతను పెంచాలి. వారికి అవకాశాల్ని కల్పించి, మెరుగైన ఆదాయాలు సంపాదించుకునేలా చేయాలి. ఆ పని చేయకుండా మనం చాలా సందర్భాల్లో ప్రజల్ని బిచ్చగాళ్లుగా మారుస్తున్నాం. వారి ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని, స్వావలంబనను అణగదొక్కుతూ పేదరికాన్ని కొనసాగిస్తున్నాం. ఉత్పాదకత, ఆత్మగౌరవం, ఆదాయాలు భవిష్యత్తు ప్రగతికి కీలకాలు. పార్టీలు నేర్చుకుంటాయా?

*

# ఎన్నికల సంవత్సరం ..
# చట్టసభల్లో యువ నాయకత్వం



జనాభా అధిక సంఖ్యలో ఉండటం ఆర్థిక వ్యవస్థకు పెద్ద బలమయ్యే అవకాశమున్న దేశం భారత్. అత్యధికులు యువత కావటంతోపాటు, వారందరి శక్తిసామర్థ్యాలనూ వికసింప చేసి అభివృద్ధిలో భాగం చేయగల అవకాశాలూ మనకి అందుబాటులో ఉండటం అందుకు కారణం.

2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో 66% జనాభా 35 ఏళ్ల లోపు వారే. 27 శాతం 24 ఏళ్లలోపు వారు కాగా, 70 శాతం పైగా 15-64 ఏళ్ల వారు. 65 ఏళ్లు పైబడినవారు ఆరు శాతం ఉంటారని అంచనా. సగటు వయసు 28.8 సంవత్సరాలు. పైగా జనాభా పెరుగుదల రేటు స్థిరీకరణ సాధించింది. ప్రస్తుతం మన దేశంలో సంతాన సాఫల్యత శాతం అధికారిక లెక్కల ప్రకారం 2.1 కంటే తక్కువగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో 1.6 శాతంగానే ఉంది. కాబట్టి సద్వినియోగం చేసుకుంటే 2047 సంవత్సరానికల్లా మనం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని, ప్రపంచంలోని అగ్రదేశాలకు దీటుగా వ్యవహరించగలగాలని కొన్ని తరాల భారతీయుల కలలు నెరవేరతాయి.

మన దేశం ఆ స్థాయిని సాధించాలంటే ఆర్థికాభివృద్ధి అత్యంత కీలకం. ఇందుకోసం సంవత్సరాలపాటు తదేక కృషి చేయాలి. అయితే ఈ క్రమంలో రాజకీయ రంగం ప్రాధాన్యతను కూడా మనం గుర్తెరగాలి.

సాంకేతికత, ప్రయివేటు రంగం, ప్రపంచీకరణ వల్ల ఆర్థిక రంగంలో అవకాశాలు రాజకీయంతో ప్రమేయం లేకుండా పెరుగుతున్నా, తాత్కాలిక సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సమతూకంతో వ్యవహరించటం, ప్రజల పన్నుల డబ్బు ప్రతి రూపాయినీ సద్వినియోగం చేయటం, మౌలిక వసతుల నిర్మాణం, పెట్టుబడులను ఆకర్షించటం, చట్టబద్ధపాలన, నైపుణ్యం, ఉత్పాదకత గల మానవ వనరుల్ని తయారుచేసేలా నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత మొదలైన ఆధునిక ప్రభుత్వ బాధ్యతల్ని రాజకీయం సవ్యంగా నెరవేర్చటం కూడా మనం ఆశిస్తున్న ప్రగతికి అవసరం. 21వ శతాబ్దపు వనరులు, అవకాశాలు ఉన్నా 19వ శతాబ్దపు రాజకీయం కొనసాగుతుంటే మనం వేగంగా వృద్ధి సాధించలేం. ఈలోగా పుణ్యకాలం కాస్తా పూర్తయి యువజనాభా సానుకూలత తగ్గే ప్రమాదముంది. ప్రస్తుతమున్నట్లు పనిచేసేవారి సంఖ్య 70 శాతం దాకా దశాబ్దాల తరబడి ఉండదు. సంతానోత్పత్తి రేటు తగ్గుతోంది కాబట్టి సగటు వయసు కూడా పెరుగుతుంటుంది. 2036 నాటికి మన దేశంలో సగటు వయసు 36కి పెరుగుతుందని అంచనా. ఈలోగా మనం ఆర్థిక రంగంపై దృష్టి పెడుతూనే సుస్థిరాభివృద్ధి దిశగా ప్రభుత్వం తన పాత్ర సవ్యంగా

నిర్వర్తించేలా రాజకీయాన్ని సంస్కరించటం మీద కూడా దృష్టి కేంద్రీకరించాలి. ఈ సంస్కరణల్లో ఎంతో కీలకమైనది ప్రజలు ఎక్కడికక్కడ పాలనను పట్టించుకుంటూ నాయకులుగా ఎదగటం. ప్రస్తుతం మన దేశంలో యువ జనాభా అత్యధికంగా ఉంది కాబట్టి దేశం నలుమూలలా పెద్ద సంఖ్యలో యువ నాయకులు తయారవటం. నూరు పువ్వులు వికసించాలి, వేయి ఆలోచనలు సంఘర్షించాలి. ప్రతి చోటా ఇలాంటి రాజకీయ, సామాజిక సంస్కృతి మన రోజువారీ జీవితంలో భాగం కావాలి. అవగాహన, సామర్థ్యం, నిబద్ధత గల యువ నాయకత్వం పెరుగుతూ మారుతున్న అవసరాలకనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు, పరిష్కారాల కోసం కృషి చేస్తుంటే, మిగిలిన సంస్కరణలు ఇంకా వేగవంతమై రాజకీయం ఆధునికమవుతుంది, భారతదేశం తన సామర్థ్యానికనుగుణంగా పూర్తిస్థాయి ఆర్థికాభివృద్ధిని సాధించగలుగుతుంది, అందరికీ ఎదిగే అవకాశాలు అందుబాటులోకి వస్తాయి, నివారించదగ్గ బాధలు తొలగుతాయి. అందువల్ల దేశవ్యాప్తంగా యువ నాయకత్వం పెరగటానికి అవరోధాల్ని తొలగించటం, అడ్డుగోడల్ని కూల్చివేయటం మన రాజకీయ కార్యాచరణలో కీలకాంశం కావాలి.

**ప్రభుత్వం పాత్రపై కొరవడిన చర్చ**

మన రాజకీయంలో ఎంతో ప్రజాదరణ పొందుతున్న నాయకత్వం, పార్టీలు ఉన్నాయి. అధికారంలో కొనసాగుతున్న వీరు తమ కృషంతా అద్భుతమన్నట్లు చెబుతుంటారు. వీరు చెప్పినదాంట్లో ఎంత వాస్తవం, ఎంత జరగాల్సుంటే ఎంత చేస్తున్నారు అనే అవగాహన సమాజంలో పెంచే బాధ్యతను ప్రధాన స్రవంతి మీడియా నిష్పాక్షికంగా నిర్వర్తించటం లేదు. సోషల్ మీడియా సహా అన్ని రకాల ప్రచార సాధనాల మీద, పార్టీలు, ముఖ్యంగా అధికారంలో ఉన్నవారు ఉక్కుపిడికిలి బిగించటం, ఓటుకి, జీవితానికి మధ్య సంబంధం ఏమిటో అర్థంకాని వ్యవస్థతోనే స్వతంత్ర భారతదేశం ప్రారంభమవటం వల్ల ప్రజలు తమ పాత్ర, ప్రభుత్వం పాత్ర, దేశాభివృద్ధికి అవసరమైన విధానాల పట్ల స్పష్టత లేకుండా ఎప్పుడు ఏ గాలి బలంగా వీస్తే అటు మొగ్గుతున్నారు.

**తలసరి ఆదాయం గురించి చెప్పరు**

ఉదాహరణకు, మనకేం లోటు, ఒకప్పుడు మనల్ని పాలించిన బ్రిటన్‌ను కూడా దాటేసి మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అయిదో స్థానంలో ఉంది, త్వరలో జర్మనీ, జపాన్‌ను కూడా దాటేసి మూడో స్థానంలోకి ఎదగబోతున్నాం అని పాలకులు చెబుతుంటారు. కానీ, తలసరి ఆదాయంలో మన దేశం ఎక్కుడుంది? ప్రపంచంలో ఎన్నో స్థానంలో ఉంది? తలసరి ఆదాయంలో ఎప్పటికి మనం మూడో స్థానంలోకి వెళ్లగలం? ఎందుకు వెళ్లలేకపోతున్నాం?.. ఈ ప్రశ్నల్ని ఏ పాలకుడూ లోతుగా చర్చించడు. ఏ ప్రధాన మీడియా చర్చ చేసి నిలకడగా ప్రజల్లోకి తీసుకెళ్లదు. అధికారాన్ని కోరుకుంటున్నవారు కూడా ఈ ప్రశ్నలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, వాళ్ల కంటే ఎక్కువ పంచుతా, మీ ఇంటికి తీసుకొచ్చి ఉచితాన్ని అందిస్తా, ఆర్థిక వ్యవస్థ, వచ్చే తరాలు నాశనమైనా సరే ప్రభుత్వోద్యోగుల ఓట్ల కోసం పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేస్తా వంటి హామీల్ని తమ సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు గుప్పిస్తున్నారు తప్ప.. ప్రజల తక్షణ అవసరాల్ని తీరుస్తూనే దీర్ఘకాలిక ప్రయోజనాల్ని పరిరక్షించే నాయకత్వ సామర్థ్యాల్ని ప్రదర్శించలేకపోతున్నారు.

ఎంతోకొంత వాస్తవాలు అర్థమై సరైన నాయకత్వాన్ని ఎన్నుకుని మార్పు కోసం ప్రయత్నిద్దామనుకున్నవారు కూడా తమ సంఖ్య తక్కువ ఉండటంతో మన ఎన్నికల వ్యవస్థలో తమ ఓటు వృథా అవుతుందన్న సంశయంతో తక్కువ నష్టదాయకం అని భావించే ప్రధాన పార్టీకి ఓటు వేస్తూ సాంప్రదాయ రాజకీయ చట్రంలోనే తిరుగాడుతున్నారు. అందులోనే వీలైనంత తాత్కాలిక లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. పరిష్కారాన్ని నిర్లిప్తంగా కాలానికి వదిలేస్తున్నారు. ఎన్నిక తర్వాత ఎన్నిక ఇలా జరిగి ధ్వంసం జరిగి ప్రజలకు వాస్తవాలు అర్థమై మార్పు వస్తుంది .. ఈలోగా మనం సాంకేతికతల్ని, నూతన ఆర్థిక అవకాశాల్ని ఉపయోగించుకుంటూ ఉన్న వ్యవస్థనే పిండుకుంటూ వ్యక్తిగత ఎదుగుదలను చూసుకోవటంలో తప్పు లేదని సర్దిచెప్పుకుంటున్నారు.

**పౌర సమాజంలోనూ పదును తగ్గింది**

మన ప్రభుత్వాలు విపరీత అధికార కేంద్రీకరణను ఉన్నకొద్దీ ప్రోత్సహిస్తూ డబ్బు, ప్రచారం, అధికారం అనే వలయానికే రాజకీయాన్ని పరిమితం చేయటం వల్ల, రాజ్యం మితిమీరిన బలశాలిగా తయారై పౌర సమాజం నామమాత్రమైంది. ప్రజాసంఘాలుగా, పౌర సమాజంగా చెప్పుకుంటున్న ఆలోచనాపరుల్లో చాలామంది రాజ్య వ్యవస్థ అనుమతించిన చర్చలో అనుకూలంగానో, వ్యతిరేకంగానో భాగమవుతున్నారు తప్ప మౌలికాంశాల జోలికిపోవటం లేదు, హేతుబద్ధంగా, అందరినీ సమన్వయం చేస్తూ పరిష్కారాలను ప్రతిపాదించి వాటి కోసం పనిచేయటం లేదు.

పరిస్థితిని చక్కదిద్దే చొరవను ప్రదర్శించి సంస్కరణలను తీసుకొచ్చే నాయకత్వ బాధ్యతను తీసుకోవాల్సిన రాజకీయంలో ఆ చొరవ కనిపించటం లేదు. అంతెందుకు, దేశ చరిత్రలో గొప్ప అవకాశాలున్న కాలంలో అసాధారణరీతిలో ప్రజల మద్దతును సంపాదించి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాజకీయ సంస్కరణల మీద దృష్టి పెట్టలేదు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో, ప్రపంచంలోని అగ్రరాజ్యాల్లో సైతం ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతూ భారతీయులు గొప్ప ప్రభావం చూపుతున్న కాలంలో మన దేశంలో రాజకీయ రంగంలో చాలా సందర్భాల్లో ఎందుకింత భావదారిద్ర్యం ఎందుకు కొనసాగుతోంది? ఎందుకంటే, కొత్త ఆలోచనలను హేతుబద్ధంగా చర్చించే, ప్రపంచ దేశాల అనుభవాల నుంచి నేర్చుకుంటూ మన దేశ పరిస్థితులకనుగుణంగా కొత్త పరిష్కారాలను అన్వేషించే శక్తిని మన రాజకీయం కోల్పోయింది.



ఈవేళ కూడా మన రాజకీయంలో సమర్థులు, నిజాయతీపరులు, ఎంతోకొంత మంచి చేసి పేరు తెచ్చుకుందామనుకుంటున్నవారు ఉన్నారు. కానీ వారి సంఖ్య ఉన్నకొద్దీ తగ్గిపోతోంది. వాళ్లు కూడా పరిస్థితులతో రాజీపడి విషవలయంలో కూరుకుపోవటం లేదా రాజకీయాలకు దూరమవటం చేస్తున్నారు.

ఈ దుష్పరిణామాలకు ప్రధానంగా మూల్యం చెల్లించాల్సింది, వాటి ఫలితాలు అనుభవించాల్సింది జనాభాలో ఎక్కువగా ఉన్న యువతరమే. సంక్షోభం మూలం ఏమిటో చర్చించే అరుదైన సందర్భాల్ని కూడా మనం దాటవేస్తూ దేశానికి తీవ్ర నష్టం చేస్తున్నాం. యువత ప్రాతినిధ్యం స్వతంత్ర భారతదేశ రాజకీయంలో ఉన్నకొద్దీ ఎలా తగ్గిపోయిందో మనకు పార్లమెంటు ప్రస్థానం గుర్తుచేస్తుంది. కానీ ఇటీవల పార్లమెంటు కొత్త భవనంలోకి మారటం ఒక సెంటిమెంట్ నిండిన ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా మనల్ని చుట్టుముట్టింది తప్ప 70 ఏళ్ల మన చట్టసభల తీరుతెన్నుల్ని లోతుగా సమీక్షించుకునే సందర్భంగా మారలేదు.

మొత్తం 545 మంది సభ్యులున్న ప్రస్తుత 17వ లోక్‌సభలో (2019) 35 ఏళ్ల లోపువారి సంఖ్య 21 మాత్రమే. కానీ పెద్దగా చదువు, అక్షరాస్యత కూడా లేని, పేదరికం ఇప్పటి కంటే ఎక్కువ ఉన్న కాలంలో ఏర్పడిన తొలి లోక్‌సభలో (1952) యువ సభ్యుల సంఖ్య 82. ఆ రికార్డు ఇప్పటికీ బద్దలు కాలేదు. అంతకంటే దారుణం, ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా ఉన్న దేశంగా భారత్ అవతరించిన కాలంలోనే 35 ఏళ్ల లోపు సభ్యుల సంఖ్య ఎన్నడూ లేనంతగా 21కి పడిపోయింది. అలాగే తొలి లోక్‌సభలో ఎంపీల సగటు వయసు 46.5 కాగా, ప్రస్తుత సభలో సగటు వయసు 55 ఏళ్లు.

**తొలి పార్లమెంటులో ఎలా సాధ్యమైంది?**

ప్రతి పార్టీ కార్యక్రమంల్లో యువత కనపడుతుండొచ్చు. కానీ వారిలో అత్యధికులు జెండాలు మోసే కూలీలు, కులం, మతం, ప్రాంతం వంటి పూనకాలతో ఆయా పార్టీలను, వాటి సోషల్ మీడియా ఖాతాలను అనుసరించేవారు. ఎన్నికల సమయంలో వీరికి మంచి గిరాకీ ఉంటుంది. ఆకర్షణీయ ఉద్యోగాల్లో జీతాల కంటే ఎక్కువ ఆదాయాలు ఈ సమయంలో వీరికి అందుతాయి. ఎన్నికలు ముగిశాక కూడా వీరిలో కొందరికి ఉపాధి ఉంటుంది గానీ, అప్పుడు ఆదాయాలు పెద్దగా ఉండవు. ఎమ్మెల్యే లేదా ప్రత్యర్థి నేతల తరపున ప్రజల్లో ఉంటూ వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, ప్రభుత్వంలో సిఫార్సులు వంటివి చేసిపెడుతుంటారు. వీరిలో అత్యధికుల రాజకీయ జీవితం అక్కడికే పరిమితమవుతుంది. పైస్థాయికి చేరి తమ సామర్థ్యానికి తగ్గ అవకాశాల్ని అందుకోగలిగినవారి సంఖ్య ఇటీవలికాలంలో మరీ అరుదైపోతోంది. ప్రస్తుత లోక్‌సభలో ఉన్న యువ ఎంపీల్లో ఎక్కువమంది రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నవారే. అలా వంశపారంపర్య రాజకీయ నేపథ్యం, డబ్బు లేకుండా ఒక ప్రధాన పార్టీ టికెట్ లభించే అవకాశాలు ఈవేళ లేవు.

ఎందుకీ పరిస్థితి అని లోతైన ఆలోచన ఇంత నష్టం తర్వాతైనా చేయాలి. యువ నాయకత్వం ఉన్నకొద్దీ తగ్గిపోవటానికి ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించాలి. అనుభవజ్ఞులు, వయసు ఎక్కువగా ఉన్నవారి సేవలు వద్దని కాదు దానర్థం. కానీ సమాజానికి సంపూర్ణ ప్రాతినిధ్యం వహించేలా యువతకి, వారిలోనూ అన్ని వర్గాలలో ఆసక్తి, సామర్థ్యం, నిజాయతీ ఉన్నవారికీ అవకాశం ఉండేలా రాజకీయాన్ని సంస్కరించాలి. నేరుగా రాజకీయాల్లోకి రాకున్నా తమ రోజువారీ అవసరాలు, కెరీర్ చుట్టూ ఉన్న సమాజాన్ని పట్టించుకోవటం కూడా తమ ఆనందమయ జీవితానికి అవసరం కాబట్టి తమ వృత్తివ్యాపారాలు చూసుకుంటూనే ఎన్నికల్లో, ఎన్నికల మధ్య కూడా రాజకీయ పరిష్కారాల కోసం యువత కృషి చేసేలా తగిన ఏర్పాటు రాజకీయ వ్యవస్థలో ఉండాలి.

35 ఏళ్లలోపు అత్యధిక యువ సభ్యులుండటం మొదటి పార్లమెంటులో ఎలా సాధ్యమైందన్న ప్రశ్నకు జాతీయోద్యమంలో మనకు సమాధానం లభిస్తుంది. యువత స్వాతంత్ర్య

పోరాటంలో భాగస్వాములవటం తొలి నుంచీ జరిగినా, జాతి నిర్మాణంలో భాగంగా ఉద్యమాన్ని నడుపుతూ నాయకత్వాన్ని తయారుచేయటం మహాత్మాగాంధీ వచ్చాకే మొదలైంది. తాను నాయకుడిగా రూపొందుతూ, నిరంతరం మెరుగుపరుచుకుంటూ ఎదగటమేకాకుండా, నాయకత్వానికి తగిన యువతను ఎక్కడికక్కడ గుర్తించటం, బాధ్యతలు అప్పచెప్పి వారిని తయారుచేయటం ఒక మిషన్‌లా గాంధీజీ నిర్వర్తించారు. నాయకత్వ లక్షణాలంటే పుట్టుకతో వస్తాయి లేదా నాయకులుగా ఎదగాలని సంకల్పించి నాయకులుగా ఎదగటం వంటి సిద్ధాంతాలను గాంధీ గారు నమ్మకోలేదు. ఆసక్తితో ముందుకొచ్చిన సామాన్యులను గుర్తించి బాధ్యతలు అప్పచెప్పటం, వారి చేత చిన్న చిన్న పనులు చేయిస్తూ పెద్ద విజయాల దిశగా నడిపించటం గాంధీ ఉద్యమ వ్యవహారశైలిలో కనిపిస్తుంది. నాయకత్వం కన్నా నాయకత్వ లక్షణాలతో పనిచేయటాన్ని ప్రోత్సహిస్తూ నాయకులను ఆయన తయారుచేశారు. అదేరీతిలో సొంత వనరులు, అప్పటికే తమ వృత్తుల్లో పేరుప్రఖ్యాతులు గాంచి నిలదొక్కుకున్నవారు కనిపిస్తే నాయకత్వ బాధ్యతల్లోకి ఆహ్వానించటం ఎక్కడికెళ్లినా గాంధీజీ కార్యక్రమాల్లో భాగంగా కనిపిస్తుంది. వారిలో అప్పటికే ఒకస్థాయిలో ఉన్న నాయకత్వ లక్షణాలు విస్తృతమయ్యేలా బాధ్యతలు అప్పగించేవారు. అలా అన్ని అంచెల్లో నాయకులను తయారుచేశారు. మహిళల పట్ల తొలినాళ్లలో ఛాందస భావాలు గల గాంధీజీ తన లోపాన్ని సరిదిద్దుకుంటూ దేశం నలుమూలలా అనేకమంది స్త్రీలకు స్ఫూర్తినిచ్చి వారిని నాయకులుగా తీర్చిదిద్దారు. అందుకే ప్రపంచ చరిత్రలో ఏ దేశంలోనూ లేనిరీతిలో నెహ్రూ, పటేల్, మౌలానా ఆజాద్, సుభాష్‌చంద్ర బోస్, సరోజినీ నాయుడు, రాజేంద్రప్రసాద్, ప్రకాశం పంతులు, రాజాజీ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఇలా ఎందరో నేతలు ఒకే తరంలో మన దేశంలో వచ్చారు. కానీ స్వతంత్రం వచ్చాక ఒక ఉమ్మడి శత్రువు, మన వైఫల్యాలను ఎవరి మీదో నెట్టే అవకాశం లేకపోవటంతోపాటు ప్రజాస్వామ్య పాలనలో తర్ఫీదు ద్వారా యువత నాయకులుగా ఎదిగే వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయకపోవటంతో యువ నాయకత్వం తయారయ్యే ప్రక్రియకి గండిపడింది. జాతీయోద్యమ తరం తర్వాత చట్టసభల్లో అందువల్లే వారి ప్రాతినిధ్యం తగ్గింది.

స్వాతంత్ర్యానంతరం యువ నాయకత్వం ఎదగటానికి అవరోధాలకు కారణమైన వ్యవస్థీకృత వైఫల్యాలు, పరిష్కారాలను ఇప్పుడు కొంత పరిశీలిద్దాం.

**అంబేద్కర్ హెచ్చరించిన వ్యక్తి ఆరాధన ఇంకా బలోపేతమైంది**

మన దేశం పలు స్వతంత్ర సంస్థానాల సమాహారం. ఎన్నో భాషలు, సంస్కృతులు, మతాలు, తెగలు ఉన్నప్పటికీ ప్రపంచంలో ఎక్కడా జరగనిరీతిలో సంస్థానాలను అతి తక్కువ హింసతో, శాంతియుతంగా విలీనం చేసిన ఘనత మన జాతీయోద్యమ నాయకత్వానికి దక్కుతుంది. స్వతంత్ర భారత రాజ్యాంగ రచన సమయంలో ఏకీకృత వ్యవస్థ కాకుండా రాష్ట్రాలకు కూడా యూనియన్‌తో సమానస్థాయి అధికారాలుండేలా ఫెడరల్ వ్యవస్థ వైపే మొగ్గు ఉండేది. కానీ దేశ విభజన నేపథ్యం, దేశంలోని కొన్ని సంస్థానాల్లోని పరిస్థితులు జాతీయస్థాయిలో బలమైన కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటుకి నిర్ణయించారు. దీంతోపాటు మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలకు అధికారమివ్వటం పట్ల రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కొన్ని వ్యవస్థీకృత సామాజిక అవరోధాలను ప్రస్తావిస్తూ అభ్యంతరాలను లేవనెత్తారు. ఆ కఠోర వాస్తవాలకు తగిన జవాబు అప్పటి చర్చల్లో తేలలేదు. గ్రామ స్వరాజ్యం కోసం ఎంతో బలంగా వాదించి దేశమంతా ప్రచారం చేసిన గాంధీజీ రాజ్యాంగం ఖరారుకి ముందే హతులయ్యారు. చివరికి బలమైన కేంద్రం, బలహీన స్థానిక ప్రభుత్వాలతో స్వతంత్ర భారతం రాజ్యాంగ పాలనను ప్రారంభించింది. జాతీయోద్యమ తరంలోనే ఈ గందరగోళం దుష్పరిణామాలు మొదలయ్యాయి. ఏ వ్యక్తి ఆరాధన పట్లయితే అప్రమత్తంగా ఉండాలని అంబేద్కర్ హెచ్చరించారో, ఆ వ్యక్తి ఆరాధనను కేంద్రీకృత పాలన ఇంకా బలోపేతం చేసింది. ఆ ధోరణి ముఖ్యంగా ఆర్థిక విధానాల్లో ఏకపక్ష నిర్ణయాలకు దారితీసి దేశానికి తీవ్ర నష్టం చేసింది. తొలితరం నేతల తర్వాత కేంద్రీకృత వ్యవస్థ దేశంలో అటు పాలనలో, ఇటు పార్టీల్లో అధికార కేంద్రీకరణ పెరగటానికి దారితీసింది. ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఆధునిక అనుభవంలేని మనలాంటి పేద దేశంలో, పాఠశాల విద్యను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన దేశంలో ఇవి తీవ్ర దుష్పరిపాలనకు, కొత్త ఆలోచనల కొత్తతరం నాయకత్వం ఎదగకపోవటానికి దారితీశాయి.

**పార్టీల నిర్మాణంలోనూ జాగ్రత్త వహించలేదు**

క్రమంగా జాతీయోద్యమ స్థాయి నాయకత్వం రాజకీయాలకు దూరమవగా, రాజకీయాల్లో ఏదో సాధిద్దామని సొంత డబ్బు ఖర్చు చేసి వచ్చిన వారిలో కూడా పలువురు రాజీపడి డబ్బు రాజకీయంలో, ఓట్ల కొనుగోలు ఎన్నికల రాజకీయంలో కూరుకుపోయారు. ఎన్నికల్లో గెలవటం లేదా వచ్చే ఎన్నికల్లో గెలిచే దాకా పార్టీని నడపటం మాత్రమే రాజకీయం అనే పరిస్థితుల్లో గెలిచినవారు వ్యవస్థల్ని సైతం పణంగా పెట్టి అధికార కేంద్రీకరణను పరాకాష్టకు తీసుకెళ్లగా, రాజకీయ పార్టీలు కొందరు వ్యక్తుల ప్రయివేటు ఆస్తులుగా మారాయి. ఎటువంటి ప్రజాసేవ నేపథ్యం లేకుండా డబ్బు పెట్టేవాళ్లు, రాజకీయాన్ని వ్యాపారంలో భాగంగా చూసేవారు, నేరముఠాలతో కుల, మత నాయకులుగా ఎదిగి మందిబలం, డబ్బు బలం సంపాదించినవారు నాయకులుగా రావటం, చట్టసభలకు ఎన్నికవటం ఆనవాయితీ అయింది. ఈ నేపథ్యంలో డబ్బు, రాజకీయ కుటుంబ నేపథ్యం, ఇవి రెండూ లేకుంటే దేశం కన్నా పార్టీ అధినేతకు విధేయత ముఖ్యమనే పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు మేలు చేయగలవారు ఎంతటి సమర్థులు, నిజాయతీపరులైనా ఏవో కొన్ని సందర్భాల్లో తప్ప పార్టీలో

ప్రాధాన్యస్థాయికి ఎదగటం కష్టమైంది. వారికి పార్టీ టికెట్లు రావు. డబ్బు, ప్రలోభాలు లేకుండా ప్రత్యామ్నాయ వేదికల మీద పోటీ చేస్తే అరుదుగా తప్ప గెలిచే అవకాశాలు లేవు. చివరికి దేశానికి గొప్ప నాయకత్వాన్ని, నాయకుల్ని అందించిన మహాత్మాగాంధీ పోటీ చేసినా గెలవలేని పరిస్థితి ఏర్పడింది. కొత్త ఆలోచనలతో పరిష్కారాల్ని అమలు చేసే సామర్థ్యం ఉన్న యువత ప్రవేశించటానికి వీల్లేకుండా, అలాంటి వాళ్లు అసలు తయారవకుండా మన రాజకీయ వ్యవస్థను, అందుకు వేదికలుగా ఉన్న పార్టీలను కరడుగట్టిన ఫ్యూడల్ నిర్మాణాలుగా చేసేశాం. దీనికితోడు స్వేచ్ఛా మార్కెట్, సాంకేతికతలు రావటంతో ప్రజల్లో, యువతలో వ్యాపకాలు పెరిగి రాజకీయాలకు బయట కూడా తమ ఆదర్శాలకు అవకాశాల్ని, గుర్తింపుని వెతుక్కోసాగారు. ఇప్పటికే ఉన్న నాయకులు ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి మారటం, కండువాలు మార్చుకోవటం తప్ప కొత్తగా వచ్చే నాయకులు తగ్గిపోయారు. స్థానిక ప్రభుత్వాలు నామమాత్రం కావటంతో అక్కడ ప్రజల భాగస్వామ్యం తగ్గిపోయింది. ఎన్నికైనవారిలో కూడా నాయకత్వ సామర్థ్యాలు వికసించే పరిస్థితి కొరవడింది. అందుకే రిజర్వేషన్లు 50 శాతం దాకా మహిళలు, అణగారిన వర్గాలకు అమలవుతున్నా కూడా వారిలో సాధికారత పెంపొందించి పైస్థాయికి పెంచేవి కాకుండా మొక్కుబడిగా తయారయ్యాయి. ప్రజాస్వామ్యానికి పాఠశాలలు స్థానిక ప్రభుత్వాలు అనే మౌలిక సూత్రం లోపించటం వల్ల మన దేశంలో ఓటుకు, తమ జీవితానికి మధ్య సంబంధం మెజారిటీ ప్రజలకు అర్థం కాని వ్యవస్థ తయారైంది, యువతను రాజకీయాల్లో సమర్థ నాయకులుగా తీర్చిదిద్దే ప్రక్రియ దెబ్బతింది. బ్రిటన్‌లో రిషి సునాక్ 35 ఏళ్లకే ఎంపీ అయి 42 ఏళ్లకు ప్రధానమంత్రి కాగా, మన దేశంలోని యువత అలాంటి ఊహ కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. వలసపాలనలో ఒక ఉమ్మడి శత్రువు మీద పోరాడటం కంటే స్వతంత్ర దేశంలో స్వయంపాలన కష్టమైనది. స్వతంత్రానంతరం కూడా మన జాతీయోద్యమ నేతలు తమ నాయకత్వ బాధ్యతల్ని చాలావరకు అద్భుతంగా నెరవేర్చారు. కానీ గాంధీజీ ఆరోజు చేసినట్లు నాయకులను తయారుచేసే వ్యవస్థల ఏర్పాటులో రాజ్యాంగ నిర్మాణ సమయంలో జరిగిన గందరగోళాన్ని సరిదిద్దటంలో ఈ ఏడున్నర దశాబ్దాలలో కూడా విఫలమయ్యారు. అందరూ చట్టసభలకు ఎన్నిక కానక్కర్లేదు, కానీ అక్కడ సమర్థ నాయకులు, యువ జనాభా ఎక్కువ ఉన్న కాలంలో యువ నాయకులు లేకపోవటం మనం ఒక సమాజంగా, దేశంగా ఎదుర్కొంటున్న ఓ పెద్ద సంక్షోభానికి చిహ్నం.

**నాలుగు దశాబ్దాల తర్వాత ఒక తప్పు మాత్రమే కొంతమేర సరిదిద్దుకున్నాం**

ఈ సంక్షోభాన్ని పరిష్కరించాలంటే అధికార వికేంద్రీకరణ తప్ప మరో మార్గం లేదు. అధికార వికేంద్రీకరణ లేకుండా దేశ రాజధానుల్లో ఎంత బలమైన నాయకుడు కొలువై ఉన్నా దేశం తన శక్తిసామర్థ్యాలకు తగ్గ స్థాయిలో అభివృద్ధి సాధించే అవకాశం లేదు. దేశానికి స్వతంత్రం వచ్చి నాలుగు దశాబ్దాలు గడిచాక గానీ మనం పాలన, ఆర్థిక రంగాల్లో చేసిన రెండు మౌలికమైన తప్పిదాల్ని గుర్తించలేకపోయాం. విధిలేని పరిస్థితుల్లోనే అయినా ఆర్థిక రంగంలో లైసెన్స్-పర్మిట్ రాజ్‌ను చాలామేర సరిదిద్దుకుని సరళీకరణకు నాంది పలికాం గానీ, స్థానిక ప్రభుత్వాల సాధికారత విషయంలో మాత్రం నామమాత్రానికే పరిమితమయ్యాం. రంగు, రుచి, వాసన లేని రీతిలో 73, 74 రాజ్యాంగ సవరణల్ని తీసుకొచ్చారు. అందులో వేల పదాలు ఉన్నాయిగానీ, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధుల బదిలీకి సంబంధించి అసలైన పదాలు లేవు. దీంతో అవి మొక్కుబడిగా మిగిలిపోయాయి.

దేశానికి స్వతంత్రం వచ్చాక 73, 74వ రాజ్యాంగ సవరణలు వచ్చే లోపు (1992) దెబ్బయ్యవ దశకం దాకా స్థానిక ప్రభుత్వాలకు గుర్తింపు కొనసాగింది. అప్పట్లో జడ్పీ చైర్మన్లు మంత్రులకన్నా శక్తిమంతంగా ఉండేవారు. ఆ సమయంలోనే సుమారు 28 మంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులను స్థానిక ప్రభుత్వాలు అందించాయి. 1993 తర్వాత ఈ జాబితాలో వంశపారంపర్య రాజకీయ నేతల్ని మినహాయిస్తే దేవేంద్ర ఫడ్నవిస్, దినేష్ శర్మ, భూపేంద్ర పటేల్ వంటి మూడు నాలుగు పేర్లే కనిపిస్తాయి. ఎన్.టి రామారావు, కరుణానిధి, బిజూపట్నాయక్, రామకృష్ణ హెగ్డే వంటి నేతల కృషితో అధికారం కొంతమేర వికేంద్రీకరణ జరిగి రాష్ట్రాల వరకు ఫెడరలిజం బలపడినప్పటికీ అక్కడ్నుంచి మాత్రం అధికారం దిగువకు వికేంద్రీకరణ జరగలేదు. తమ అధికారాల కోసం యూనియన్‌తో కొట్లాడిన రాష్ట్ర ప్రభుత్వాలు అదే రీతిలో స్థానిక ప్రభుత్వాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వటానికి నిరాకరిస్తున్నాయి. ఎమ్మెల్యేలకు అప్రకటిత పాలనాధికారాలనిచ్చి వాటిని ఇంకా అణగదొక్కాయి. యూనియన్ ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల్లో 3-4 శాతం స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయటానికి కూడా రాష్ట్ర ప్రభుత్వాలు కొర్రీలు పెడుతున్నాయి. అదే అమెరికా వంటి దేశాల్లో 30% దాకా స్థానిక ప్రభుత్వాలకు కేటాయిస్తున్నారు. జర్మనీ వంటి దేశాల్లో పాస్‌పోర్ట్ వంటి సేవల్ని కూడా స్థానిక ప్రభుత్వమే నిర్వహిస్తుంది. మన వద్ద స్థానిక సాధికారత లేకపోవటం వల్ల అక్కడ అణగారిన వర్గాలకు, మహిళలకు రిజర్వేషన్ల వల్ల కూడా ఫలితం లేకుండా పోయింది. మహిళా ప్రజాప్రతినిధుల బదులు వారి ఇంట్లోని మగవారు పెత్తనం చేయటం కన్నా కూడా.. ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇవ్వకుండా ఎన్నికైనవారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చటం పెద్ద వ్యవస్థాగత తప్పిదం. కనీసం నగరాల నుంచయినా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం ఇప్పుడు ఇండియాకి అవసరం. ఆర్థిక చోదక శక్తులుగా ఉండే మహానగరాల సుస్థిర వృద్ధికి కూడా బలమైన స్థానిక పాలన తప్పనిసరి. ఇటీవల రిజర్వు బ్యాంకు కూడా నగరాలకు ఆర్థిక, పాలనా సౌష్టవం తప్పనిసరి అని స్పష్టం చేసింది. 2030 నాటికి మన దేశంలో 10 లక్షలకు పైబడిన నగరాలు 60కి పైగా

ఉంటాయని అంచనా. గ్రామాల్లో గాంధీ, అంబేద్కర్‌లను మేళవించి కులతత్వాన్ని బలహీనపరచేలా కొన్ని గ్రామాల సమూహాన్ని పంచాయతీకి యూనిట్‌గా మార్చి క్లస్టర్ పంచాయతీలను ఏర్పాటు చేయాలి, జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తి కల్పించాలి.

పరిపాలన, రాజకీయం ప్రధానంగా రాష్ట్రాల్లో ఉంటుంది. రాష్ట్రాల్లో ఫెడరలిజం ఇప్పుడు గణనీయంగా మెరుగుపడింది. పోటాపోటీ ఎన్నికల రాజకీయాల వల్ల కొన్ని ఒడిదుడుకులున్నా కూడా సహకార, పోటీ ఫెడరలిజం ఒక చట్టబద్ధ ఏర్పాటుగా మాత్రమే కాకుండా సంస్కృతిగా కూడా మారుతోంది. ఫెడరలిజాన్ని మూడో అంచెలోకి తీసుకెళ్లి స్థానిక ప్రభుత్వాలను వార్డు స్థాయి కమిటీల వరకూ పౌరుల భాగస్వామ్యంతో బలోపేతం చేయటం ఇప్పుడు మనకు ప్రధానంగా కావలసినది. స్థానిక ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం వల్ల ఆ ప్రభావం రాష్ట్ర స్థాయి పాలనపై కూడా పడుతూ అధికార పార్టీలకు రాజకీయంగా చెడ్డ పేరు తెస్తోంది. అందుకే స్థానిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ చొరవ చూపాలి.

**వేగంగా మార్పుకి ఎన్నికల సంస్కరణలే మార్గం**

స్థానిక ప్రభుత్వాలు బలపడటం వల్ల పౌర సేవలు అందించటంలో ప్రభుత్వ సామర్థ్యం పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందిగానీ ఎన్నికల తీరులో వెంటనే మార్పు రాదు. ఇన్ని దశాబ్దాల నిర్లక్ష్యానికి మనం చెల్లించాల్సిన మూల్యం అది. ఈలోగా మనం ఎన్నికల వ్యవస్థను సంస్కరిస్తే యువ నాయకత్వాన్ని తగిన స్థాయిలో ప్రోత్సహించగలం. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేస్తే, ఒకటి, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు తగ్గుతుంది, రెండు, ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం లేకపోవటం, మంత్రిమండలిలోకి సమాజం నుంచి కూడా నిష్ణాతుల్ని తీసుకునే వెసులుబాటు వల్ల ముఖ్యమంత్రి మెరుగైన పాలన అందించే అవకాశాలు ఏర్పడతాయి. అదే సమయంలో ముఖ్యమంత్రి నియంత కాకుండా ఎమ్మెల్యేలు శాసనసభ నుంచి నియంత్రిస్తుంటారు. వీటితో పాటు స్థానిక నాయకత్వాన్ని అణచివేసే ఎమ్మెల్యేల పెత్తనాన్ని నిరోధించవచ్చు. దీంతోపాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకొస్తే డబ్బు రాజకీయం, తాత్కాలిక తాయిలాలు, కులం, మతం వంటి వాటి ప్రభావం గణనీయంగా తగ్గి నిజమైన యువ నాయకులకు అవకాశాల్ని కల్పిస్తాయి. వీటన్నిటితోపాటు పార్టీల్ని కూడా సంస్కరించటం అవసరం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న భారతీయ సంతతి యువ నేత వివేక్ రామస్వామి కేవలం ఆరు నెలల్లో మొత్తం దేశం దృష్టిని ఆకర్షించగలిగారు. కొన్ని ఒడిదుడుకులున్నా పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో రాజకీయ పార్టీలు నిజమైన రాజకీయ పార్టీల్లా వ్యవహరిస్తూ సమర్థులు, నిజాయతీపరులైన యువతకి వేగంగా ఎదిగే అవకాశాలనిస్తున్నాయి. తద్వారా దీర్ఘకాల లాభం పొందుతున్నాయి, దేశం పట్ల తమ బాధ్యతను మెరుగ్గా నిర్వహిస్తున్నాయి. మన దేశంలో కూడా పార్టీల్ని ప్రజల భాగస్వామ్యానికి వీలుగా ప్రజాస్వామీకరిస్తే పెద్దసంఖ్యలో యువ నాయకులు పెరుగుతారు. వీళ్లు జాతీయోద్యమ కాలంలోలా పెద్ద త్యాగాలు సైతం చేయాల్సిన అవసరం లేదు. తమ సామర్థ్యం, ఆసక్తి, తమకున్న అవకాశం, సమయానికి అనుగుణంగా ఎక్కడికక్కడ నాయకత్వం అందిస్తుంటారు. ఇలా క్రమంగా వీరిలో కొందరు యువత రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులుగా ఎదిగి దీర్ఘకాలిక దృష్టితో నాయకత్వం వహిస్తుంటారు.

స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తూనే ఎన్నికల సంస్కరణలు, వాటితోపాటు చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చట్టబద్ధపాలన అమలు చేయటం వల్ల ఆధునిక ప్రజాస్వామ్య పాలనకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఆర్థికాభివృద్ధి పరిరక్షణ, అందులో అందరూ భాగస్వాములు కాగలిగేలా నాణ్యమైన విద్య, ఆరోగ్యాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఆ రాజకీయ మార్పుల కోసం కృషి చేస్తే యువ భారత్ తన నాయకత్వ సామర్థ్యానికి తగ్గట్లు వికసించగలుగుతుందన్నది జాతీయ యువజన దినోత్సవ వేళ, ఎన్నికల సంవత్సరంలో మనం, ముఖ్యంగా యువత మరింత స్పష్టంగా గుర్తించాల్సిన అంశం.

*

# సంక్షేమం పేరుతో సంక్షోభం



అభివృద్ధి లేకుండా ఉచిత పథకాల పేరుతో అడిగినవారికి, అడగనివారికి అప్పులు చేసి మరీ తాత్కాలిక తాయిలాలిచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. సంక్షేమ క్యాలెండర్ పేరుతో జనవరి నుంచి డిసెంబర్ వరకు సరాసరి నెలకు మూడు చొప్పున జగనన్న, వైఎస్‌ఆర్ పేరుతో పథకాలను అవసరం ఉన్నవారికి, లేనివారికి పప్పుబెల్లాల్లా పంచి పెట్టారన్నారు. సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టించి యువతకి ఉపాధి లేకుండా చేశారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలని, రెంటి మధ్యా సమతూకం ఉండాలని ప్రజలు కోరుతున్నారన్నారు. పాలకులు ప్రజల్ని పట్టించుకోకుండా తమకు నచ్చినట్టే ఉంటే అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని బాబ్జీ హెచ్చరించారు.

# దేశ సేవ చేద్దామనుకుంటున్నారా? ... అయితే బాగా డబ్బు సంపాదించండి

\- శ్రీరాం






ప్రపంచంలో అన్నిటికన్నా విలువైనది ఏంటి? డబ్బులు? తల్లిదండ్రులు? కెరీర్? కుటుంబం? ఇవన్నీ విలువైనవి అయిన ప్పటికీ వీటి కన్నా విలువైనది సమయం. ఎందుకంటే, సమయాన్ని సరిగ్గా వాడుకుంటేనే వీటన్నిటిలో రాణించగలం.

నిజంగా మన సమయం మీద మనకి పూర్తి కంట్రోల్ ఉందా? ఆలోచించండి. దీనికి సమాధానం తెలుసుకోవాలంటే దాని కన్నా ముందు ఇంకొక ప్రశ్న మిమ్మల్ని మీరు అడగాలి. 'నా లక్ష్యం ఏంటి?' అని. ఎందుకంటే లక్ష్యం లేని వారికి సమయం ఉంటే ఏంటి, లేకపోతే ఏంటి? ఆ లక్ష్యం ఏదైనా అవ్వచ్చు. ఫలానా ఉద్యోగం, ఫలానా వ్యాపారం, నటన, రాజకీయాలు, ఇంత డబ్బులు, పర్యటనలు, దేశ సేవ, ఇంకా ఏదైనా అవ్వొచ్చు.

ఇప్పటిదాకా ఒక లక్ష్యం లేకపోయినా ఫర్వాలేదు. ఏంటో ఎలా ఉండాలో ఇప్పుడు ఆలోచించండి, వెంటనే సమాధానం దొరకకపోవచ్చు. మీరు దాని గురించి ఆలోచిస్తూ ఉంటే మీకు మీ జీవిత లక్ష్యం ఒక రోజులో, ఒక వారంలో, ఒక నెలలో, ఒక సంవత్సరంలో స్ఫురించవచ్చు.

నా మట్టుకు నాకు అలా ఆలోచించగా సంవత్సరం తరువాత తెలిసింది. ఆ రోజున తారీఖు 22 నవంబర్, 2008. అప్పుడు నా వయసు 24 సంవత్సరాలు. అప్పటి నుండి నేను నా జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి నా లక్ష్యమే దిక్సూచి. నా లక్ష్యం నేను తొందరగానే తెలుసుకున్నానని కొందరన్నారు. నేను కొన్ని సంవత్సరాలు ఆలస్యం అయింది అనుకున్నాను. తొందరగానైనా.... ఆలస్యమైన.... ముఖ్యమైన విషయం ఏంటంటే నా లక్ష్యం నేను తెలుసుకున్నాను.

ఒక లక్ష్యం ఏర్పడిన తర్వాత ఆ దిశగా ఎంత సమయం ఎంత కృషి చేయగలుగుతున్నామో ఆలోచించాలి. మన లక్ష్యాలు చిన్నవి అయినప్పుడు కొంత సమయం కేటాయిస్తే సరిపోతుంది. అదే పెద్ద లక్ష్యాలు అయినప్పుడు చాలా సమయం వెచ్చించాల్సి వస్తుంది. అలాంటప్పుడు మన సమయంపైన మనకి ఉన్న కంట్రోల్ చాలా ముఖ్యం.

మన సమయంపైన మనకి పూర్తి కంట్రోల్ ఎలా వస్తుంది? ఆర్థిక స్వేచ్ఛ ద్వారా.... ఆర్థిక స్వేచ్ఛ అంటే ఏంటి? అది ఎలా వస్తుంది? ఆర్థిక స్వేచ్ఛ అంటే మీ నెలవారి ఖర్చులకు కావాల్సిన మొత్తం ఎవరి మీద ఆధారపడకుండా మీ పెట్టుబడుల నుంచి కానీ, మీ వ్యాపారం నుండి కానీ, మీ సమయం వెచ్చించకుండా గాని లేక అతి తక్కువ సమయం వెచ్చించడంతో రావటం.

**ఆర్థిక స్వేచ్ఛ రావడానికి...**

**మొదటి మెట్టు:** డబ్బు గురించి మన ఆలోచనలు ఆ దిశలో చేయాలి. మనలో చాలామందికి చిన్నప్పటి నుంచి డబ్బులు గురించి ఎక్కువగా మాట్లాడటం లేక ఎక్కువ డబ్బులు సంపాదించాలి అనుకోవడం తప్పు అని చెప్పారు.

మనం అందరం ఒకటి గుర్తుపెట్టుకోవాలి. మంచివాళ్ళకి మంచి మార్గంలో ఎక్కువ డబ్బులు సంపాదించడం బాధ్యత. మంచివాళ్ల దగ్గర ఎక్కువ డబ్బులు ఉంటే అవి మంచి పనులకు ఉపయోగపడతాయి.

**రెండవ మెట్టు:** ఏంటంటే మనకి ఆర్థిక స్వేచ్ఛ అంటే ఏంటో, ఎంత డబ్బులు మనం ఎప్పటికి సమకూర్చాలో, ఆ డబ్బులు సమకూర్చుకోవడానికి ప్రతి నెలా ఎంత ఆదా చెయ్యాలో తెలుసుకోవాలి. తర్వాత ఆదా చేసిన డబ్బులు ఎలా ఇన్వెస్ట్ చేయాలో ఆలోచించాలి. దీని గురించి మీకు తెలియకపోతే మంచి ఫైనాన్షియల్ ప్లానర్‌ని సంప్రదించండి. చాలామంది ఈ పని ఉచితంగానే చేస్తారు.


**మూడవ మెట్టు:** ఆర్థిక స్వేచ్ఛ ఎలా సాధించాలో నిర్ణయించుకోవటం. నా అభిప్రాయంలో దానికీ రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, ఉద్యోగం చేస్తూ ప్రతి నెలా కొంత ఆదా చేస్తూ ఆ డబ్బుని సరిగ్గా ఇన్వెస్ట్ చేయడం. ఇంకొకటి ఒక వ్యాపారం మన ప్రమేయం లేకపోయినా ఎదుగుతూ ప్రతి నెల మనకి డబ్బులు వచ్చేటట్లు నిర్మించడం. ఈ రెండు చేస్తూ ఆర్థిక స్వేచ్ఛని చేరడానికి 5-10 సంవత్సరాలు పడుతుంది. వ్యాపారం అయితే కొంత తొందరగా అవుతుంది. అయితే మనకి వ్యాపారంలో ఎలా చేయాలో చెప్పేవాళ్ళు కావాలి. ఈ దారిలో కొంత ముందుకి కొంత వెనక్కి అవ్వవచ్చు. కానీ మనం క్రమశిక్షణతో ఉంటే ఖచ్చితంగా ఆర్థిక స్వేచ్ఛ సాధించవచ్చు. అది సాధించిన తర్వాత మనం మన మనస్సుకి నచ్చిన పనులు పదిమందికి పనికివచ్చే పనుల కోసం చాలా సమయం కేటాయించవచ్చు.

✳ **(జనవరి 12 జాతీయ యువజన దినోత్సవం)**

# ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరం నిజమైన ఎన్నికల సంస్కరణ

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు సంబంధించిన పలు ఆస్తులపై డిసెంబర్‌లో ఆదాయ పన్ను శాఖ చేసిన దాడుల గురించి మీడియాలో విస్తృతంగా వార్తలు వచ్చాయి. కళ్లు చెదిరే స్థాయిలో నోట్ల కట్టలు పట్టుబడ్డాయి. రూ. 350 కోట్లు దొరికినట్లు సమాచారం. టీవీ ఛానెళ్లలో యధావిధిగా పార్టీల మధ్య పరస్పర ఆరోపణల యుద్ధం జరిగింది. రాజకీయ ఎదురుదాడుల్ని అలా ఉంచితే, భారతదేశంలో ఎన్నికలకు, లెక్కచెప్పని వేల కోట్ల రూపాయల నగదుకు మధ్య విడదీయలేని బంధం ఉందనేది జగమెరిగిన సంగతి.

ఇటీవల నిర్వహించిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలో, ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల్లో అత్యధికులు సగటున రూ. 25-30 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా. బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీల ఖర్చునూ లెక్కేస్తే, మొత్తం నియోజకవర్గ స్థాయి ఎన్నికల ఖర్చు సుమారు రూ. 10,000 కోట్లు. 17 లోక్‌సభ స్థానాలున్న ఒక చిన్న రాష్ట్రంలో ఇది దిగ్భ్రాంతి కలిగించే మొత్తం. దీంతోపాటు, ప్రకటనలు, స్టార్ నేతల ప్రచారానికి ప్రధాన పార్టీలు బోలెడు డబ్బు వెచ్చించాయి. చట్టబద్ధ కార్యకలాపాలకి పార్టీలకు డబ్బు అవసరం. కానీ నిజమైన సమస్య, ఎన్నికల ప్రచారాలకి, పార్టీని సంస్థాగతంగా నడపటానికయ్యే చట్టబద్ధ ఖర్చు కాదు. మన రాజకీయ ప్రక్రియలో చట్టవిరుద్ధ నిధుల సమీకరణకు అంతం లేదు. చాలా రాష్ట్రాల్లో ఎన్నికల్లో చేసే ఖర్చులో చాలా మేర డబ్బుతో, బహుమతులు, మద్యం వంటి ఇతర ప్రలోభాలతో ఓటరుకు లంచం ఇవ్వటానికే అవుతోంది. కేరళ మినహాయించి అన్ని దక్షిణాది రాష్ట్రాలలో చట్టవిరుద్ధమైన, లెక్కలు చెప్పని భారీస్థాయి వ్యయం నియమంలా మారింది. మిగిలిన చాలా రాష్ట్రాల్లోకి కూడా ఈ తీరు వ్యాపిస్తోంది. ఓటరును ప్రలోభపెట్టటం ఉన్నకొద్దీ సర్వసాధారణమవుతోంది. దీనర్థం, డబ్బుతో మీరు ఓటర్లని కొనగలరని కాదు; బరిలో ఉన్నట్లు, పోటీలో పరిగణలోకి తీసుకోదగిన అభ్యర్థిగా అనిపించుకునేందుకు భరోసాకి మాత్రమే ఓటర్లకు డబ్బు పంపిణీ పనికొస్తుంది. ఇంకా చెప్పాలంటే, ఎన్నికల్లో పోటీకి డబ్బు పంపిణీ ప్రవేశ రుసుములా తయారైంది. ఓటర్లపై చేసే భారీ ఖర్చు గెలుపుకి గ్యారంటీ కాదు; కానీ ఖర్చు పెట్టకపోతే ఓటమి మాత్రం దాదాపు గ్యారంటీ. ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీర్ ఓటర్లు కూడా ఎన్నికల సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు ఆశిస్తున్నారు.

ఓట్ల కొనుగోలు చట్టవిరుద్ధం, ఓటర్లకు లంచమిచ్చే అభ్యర్థి, పార్టీ కార్యకర్తలు, ఆ డబ్బు తీసుకునే ఓటర్లు కూడా నేరానికి పాల్పడుతున్నట్లు లెక్క. కానీ పాతుకుపోయిన రాజకీయ సంస్కృతిలో అది భాగమైనప్పుడు చట్టం, ప్రాసిక్యూషన్ ద్వారా నియంత్రించటం అసాధ్యం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో, చాలా రాష్ట్రాల్లోని ప్రధాన పోటీదారులు సుమారు లక్ష మందిదాకా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తారు. బరిలో ఉన్న బలమైన, గెలిచే అవకాశాలున్న ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థుల నుంచి ఓటర్లు డబ్బు తీసుకుంటారు. వారిలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తారు. మిగిలిన అభ్యర్థులకు గెలిచే అవకాశమే లేదు. ఏవో కొన్ని అరుదైన సందర్భాలు మినహాయిస్తే. దీంతో, చట్టవిరుద్ధంగా ఎన్ని కోట్లు ఖర్చు పెట్టే సామర్థ్యం ఉంది అన్నదే ఎన్నికల్లో పోటీ కోసం వచ్చిన అభ్యర్థుల్లో పార్టీలు వెతికే మొదటి అర్హత అవుతోంది. ఆ ఖర్చుకు సిద్ధపడితేనే టికెట్లిస్తున్నాయి. అందుకే టికెట్ అనగానే చాలా సందర్భాల్లో వెంటనే అడిగే ప్రశ్న, “ఎంత ఖర్చు పెట్టగలరు?”. మన తలసరి ఆదాయం పేద దేశాల స్థాయిలో ఉంటే, ఓట్ల కొనుగోలు ఖర్చు మాత్రం చాలా రాష్ట్రాల్లో సంపన్న దేశాలను మించి ఉంటోంది. ఆ ఖర్చంతా అనివార్యంగా లెక్కలుచూపని నగదు రూపంలోనే జరుగుతుంటుంది, నల్లధనాన్ని, అవినీతిని పెంచుతుంటుంది. ఎన్నికవటానికి రూ. 25-30 కోట్లు ఖర్చు చేసే అభ్యర్థి ఆ ఎన్నిక ఖర్చుతో పాటు, రాజకీయంగా ఒక స్థాయికి రావటానికి అంతకు ముందు చేసిన ఖర్చుని, గతంలో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే అప్పుడైన ఖర్చుని కూడా తిరిగి రాబట్టుకోవాలి, వచ్చే ఎన్నికలో అవసరమైన నిధుల్ని కూడబెట్టాలి. మరి వ్యక్తిగతంగా కూడా వెనకేసుకోవాలి కదా. అందుకోసం అదనంగా కాస్త పెద్ద మొత్తంలోనే సంపాదన. వెరసి, చట్టవిరుద్ధమైన, లెక్కలు





చూపెట్టని ఎన్నికల వ్యయం మన ఎన్నికల రాజకీయ వ్యవస్థలో మనుగడకి సర్వసాధారణంగా మారి, అవినీతిని అయిదు నుంచి పది రెట్లు పెంచుతోంది. ఎన్నికవటానికి ఒక పేద దేశంలో అంత భారీ మొత్తాల్ని ఖర్చు చేయటం పిచ్చి తప్ప మరోటి కాదు. అదేసమయంలో అధికారం పట్ల లాలసతో ఎన్నికల బరిలో ఎంతైనా ఖర్చు పెట్టి, ఎంత రిస్కయినా తీసుకోవటానికి సిద్ధపడుతున్న అభ్యర్థులు కావలసినంతమంది ఉన్నారు. ఫలితంగా, నిజాయతీ, ప్రజాసేవ పట్ల మమకారం ఉన్న పౌరులు మన ఎన్నికల ప్రక్రియలో ఉన్నకొద్దీ ప్రాధాన్యతను కోల్పోతున్నారు. ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు, లేదంటే రాజకీయాల నుంచి గెంటివేతకు గురవుతున్నారు, లేదూ, కాలక్రమంలో రాజీపడుతున్నారు, మనుగడ కోసం ఆటలో భాగమవుతున్నారు. నిజాయతీ, అధికారంలో మనుగడ కలసిసాగటం ఉన్నకొద్దీ అసాధ్యమవుతున్నాయి.

ఒక పౌరుడు వ్యక్తిగతంగా నిజాయతీపరుడు కావచ్చు, మన రాజకీయాల్లో ఈవేళ్టికీ చాలామంది వ్యక్తిగతంగా నిఖార్సయినవాళ్లున్నారు, కానీ ఎన్నికల్లో చట్టవిరుద్ధ ఖర్చు భరించటం కోసం, ఎన్నికల్లో తమ మనుగడని కాపాడుకోవటం కోసం వ్యవస్థీకృత అవినీతిలో అతను భాగంకాక తప్పదు.

ఓటరుకిచ్చే ప్రలోభాలు, విపరీత ఎన్నికల వ్యయం ఈవేళ ఏ స్థాయికి చేరాయంటే నైతిక విజ్ఞప్తులు, వ్యక్తిగత విలువలతో వాటిని ఎదుర్కోవటం ఇక ఎంతమాత్రం సాధ్యం కాదు. ఇప్పుడది వ్యవస్థీకృత సమస్య. ఓటరుకు ప్రలోభాల్నిచ్చే ధోరణికి పూర్తిగా స్వస్తి చెప్పేందుకు పార్టీలన్నీ నిజాయతీగా ఏకాభిప్రాయానికి రావటం అవసరం. కానీ అది పైకి కనిపిస్తున్నంత తేలిక కాదు. పార్టీలు పరస్పర అపనమ్మకంతో ఉన్నాయి. రాజకీయాల్లో గుర్తింపు కోసం భారీ మొత్తాల్ని వెచ్చించటానికి చాలామంది అభ్యర్థులు సిద్ధంగా ఉన్నప్పుడు, పార్టీల స్వీయనియంత్రణ ఆచరణలో సులభం కాదు. ఇక మిగిలిన పరిష్కారం, ఓట్ల కొనుగోలు వల్ల పెద్ద ఉపయోగంలేదనే రీతిలోకి ఎన్నికల వ్యవస్థను మార్చటం. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, మిగిలిన అభ్యర్థుల ఓట్లన్నీ వృధాయే అనే ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ ఎన్నికల వ్యవస్థ మనలాంటి పేద దేశంలో, అధికార కేంద్రీకరణ, బలహీన చట్టబద్ధపాలన ఉన్న దేశంలో ఓట్ల కొనుగోలుకు పెద్ద ప్రోత్సాహకంగా మారుతుంది. మనం సమష్టిగా ఆత్మావలోకనం చేసుకోవాలి, ప్రోత్సాహకాన్ని మార్చాలి. ధనస్వామ్యం, దోపిడీస్వామ్యం నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటానికి నిజమైన ఎన్నికల సంస్కరణ పద్ధతులపై మనం దృష్టి సారించటం తక్షణావసరం. ⁕



# హామీల అములుపై
# కాంగ్రెస్ ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటన, హామీల అమలుకు కసరత్తు నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పందన:



తెలంగాణలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం ప్రకటించింది. రాష్ట్రానికి 6.71 లక్షల కోట్ల అప్పు ఉన్నట్లు తెలిపింది. 2014-15లో బడ్జెట్ రుణభారం సుమారు రూ.72,000 కోట్లు కాగా ఇప్పుడు రాష్ట్ర వార్షిక రెవెన్యూ రాబడిలో 34 శాతం సొమ్ము అప్పులు చెల్లించటానికే పోతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న అప్పుల్లో ప్రభుత్వం విధిగా చెల్లించాల్సిన అవసరంలేనివి పక్కనపెట్టి, బడ్జెట్ అప్పులు, బడ్జెట్ బయట రుణాలు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన సుమారు రూ.40,000 కోట్లను లెక్కేస్తే తెలంగాణ రుణభారం ఈవేళ రూ.5,50,000 కోట్ల దాకా తేలుతుంది. రాష్ట్ర స్థూల ఆదాయంలో అప్పుల నిష్పత్తి 39 శాతానికి చేరింది. ఈ పరిస్థితి వల్లే 2022-23 ఆర్థిక సంవత్సరంలో 365కి గాను 328 రోజుల పాటు, అంటే కొన్ని సందర్భాల్లో ఆదివారాల్లో కూడా రోజువారీ ఖర్చులకు రిజర్వుబ్యాంకు నుంచి ప్రభుత్వం ఓవర్‌డ్రాఫ్ట్ రుణం తీసుకుంది. అధిక వడ్డీ చెల్లించింది. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది ఇలా ఒక్కరోజు కూడా ఓడీ తీసుకోవాల్సిన అవసరం రాలేదు. ఇంకొన్ని రాష్ట్రాలు ఇంతకంటే అధ్వాన్నంగా ఉన్నాయి గానీ, ఒక చిన్న రాష్ట్రంలో హైదరాబాద్ వంటి పెద్ద మహానగరం ఉన్న తెలంగాణలో ఈ పరిస్థితి నివారించదగ్గది.

హైదరాబాద్ వల్ల తెలంగాణ 2014లో మిగులు ఆదాయంతో ప్రారంభమైంది. అయిదేళ్లలో రూ.1,16,000 కోట్ల మిగులు ఆదాయం రాష్ట్రానికి ఉంటుందని అప్పట్లో 14వ ఆర్థిక సంఘం అంచనా వేసింది. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనట్లు పట్టణీకరణ అనుకూలత తెలంగాణకు ఉంది. రాష్ట్ర జనాభాలో 30 శాతం హైదరాబాద్‌లో నివసిస్తుండగా, ఆదాయంలో 70 శాతం దాకా మహానగరం నుంచే వస్తోంది. అలాంటి రాష్ట్రం ఇంతగా అప్పుల్లో కూరుకుపోవటం, అన్ని రోజులు ఓవర్ డ్రాఫ్ట్‌కి వెళ్లటం ఆందోళనకరం. హైదరాబాద్ నగరం ఉండటం వల్ల అది సంక్షోభం కాదు గానీ, అప్రమత్తమై జాగ్రత్త పడకుంటే మాత్రం ప్రమాదకరం.

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం పలు తాత్కాలిక సంక్షేమ హామీలనిచ్చింది. కానీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో వారు ప్రకటించిన శ్వేతపత్రమే తెలియచేస్తోంది. కాబట్టి విజ్ఞతను ప్రదర్శించాలి. ఆర్థిక పరిస్థితిని, హామీల అమలును సమతుల్య పరచాలి. ఇందుకోసం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. మన రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన డా॥ రంగరాజన్, అదే విధంగా కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా పనిచేసిన మాంటెక్ సింగ్ ఆహ్లువాలియా, ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన వైవీ రెడ్డి లాంటివారు ఉన్నారు. అలాంటివారితో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఇచ్చిన హామీల్లో ఏవి ప్రయోజనకరమైనవి, అమలు చేయటం సాధ్యమైనవి గుర్తించి ఆ మేరకు అమలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా హామీల్ని ఆర్థిక పరిస్థితికనుగుణంగా సర్దుబాటు చేస్తే మనందరం కూడా మద్దతివ్వాలి. నిజానికి శ్వేతపత్రంలో ప్రకటించిన లెక్కలేవీ కొత్తవి కావు. గత ఏడాది కాలంగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ విషయాల్ని చెబుతూ అప్పులు చేసి తాత్కాలిక పథకాలు, ఖజానాను దివాలా తీయించే ప్రభుత్వోద్యోగుల పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వంటి అంశాలపై పార్టీల్ని హెచ్చరిస్తూనే ఉంది. కొన్ని నెలల క్రితం ఓపీఎస్ అంశంపై సమగ్ర గణాంకాలు, ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు పరిష్కారాలతో ప్రచురించిన పుస్తకంలో కూడా ఈ వివరాల్ని ఎఫ్‌డీఆర్ తెలియచేసింది. అయినా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓపీఎస్ హామీనిచ్చింది. సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా ఏకంగా రాష్ట్ర ఖజానాపై ఏటా అదనంగా రూ.1,30,000 కోట్ల భారం పడే హామీలనిచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశాక, ఎన్నికల్లో తొందరపాటుగా ఇచ్చిన హామీల్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తే అభినందించాలి. మన ఆర్థికాభివృద్ధిని, మన బిడ్డల భవిష్యత్తును కాపాడుకునేందుకు ఇది తప్పనిసరి.

ఇలా హామీల్ని హేతుబద్ధీకరించటంతోపాటు అప్పు చేసి పప్పుకూడు తినే ధోరణికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి చెప్పాలి. ప్రభుత్వోద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, ఇతర రోజువారీ ఖర్చులకు సొంత ఆదాయం నుంచి మాత్రమే ఖర్చు చేయాలి. అప్పు తెచ్చిన డబ్బుల్ని కేవలం భవిష్యత్తు అవసరాలకి



కీలకమైన పనులున్నాయి. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందించటానికి, చట్టబద్ధపాలన అమలు, స్థానిక కోర్టులతో సత్వర న్యాయం, మహిళల భద్రత, సిటిజన్ చార్టర్లతో ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా నాణ్యమైన పౌర సేవలు, పాలనా సమాచార హక్కు చట్టం అమలు, అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాల బలోపేతం మొదలైనవాటికి అదనంగా చేయాల్సిన ఖర్చేమీ లేదు. కొద్దిపాటి నిధుల్ని అదనంగా కేటాయిస్తే ప్రతి ఇంటికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం ఎటువంటి జేబుఖర్చు లేకుండా అందించటం సాధ్యం. అదే విధంగా గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కొనసాగించాలి, పెట్టుబడులను ప్రోత్సహించాలి.

పెట్టుబడులుగా మాత్రమే ఉపయోగించాలి. ఆ పెట్టుబడులను కూడా ఖర్చుకు తగ్గ ఆదాయమొచ్చే రీతిలోనే చేయాలి తప్ప ఆర్థిక భారమయ్యేలా చేయకూడదు. వంద రూపాయలు ఖర్చు చేస్తే నలభయ్యో, యాభయ్యో ఆదాయమొస్తే అది సమాజానికి, భావితరాలకు కూడా భారమవుతుంది. ఈ రకంగా రోజువారీ ఖర్చులకు అప్పు చేయకుండా, అప్పుల్ని కేవలం సహేతుక పెట్టుబడులకు మాత్రమే వినియోగిస్తే మూడు నాలుగేళ్లలో తెలంగాణ కుదుటపడుతుంది.

ఇదే సమయంలో, డబ్బు ఖర్చు లేకుండా ప్రభుత్వం చేయగలిగిన

ప్రభుత్వం ఈ దిశగా వ్యవహరిస్తే పాలన గణనీయంగా మెరుగుపడటంతోపాటు యువతలో నైపుణ్యాలు, ఉత్పాదకత పెరుగుతాయి, అంతా హైదరాబాద్ చుట్టూనే కాకుండా చిన్న పట్టణాలు వృద్ధి చెంది ఉపాధి అవకాశాలు అన్ని జిల్లాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో కూడా అందుబాటులోకి వస్తాయి. ప్రతిపక్షాలు తమ రాజకీయ విమర్శలను వచ్చే ఎన్నికలకు వాయిదా వేసి ఈ దిశగా ప్రభుత్వానికి సహకరించాలి. ✳



# తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హైదరాబాద్‌లో జేపీని కలిసి కొత్త ప్రభుత్వం ముందున్న బాధ్యతలు, సవాళ్లపై విస్తృతంగా చర్చించారు.

ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించి సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి మధ్య సమతూకం పాటిస్తూ ప్రభుత్వం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జేపీ సూచించారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే భుజం తట్టటానికి ముందుండాలని, ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడితే పరిష్కారం చూపుతూ విమర్శించాలన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలు నెరవేరే దిశగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నంత వరకూ ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రజల పక్షాన నిరంతరం గొంతు వినిపిస్తుంటామని, కార్యక్రమాల్ని చేపడతామని తెలిపారు. సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ధర్మారావు, నేతలు బొర్రా శివరామకృష్ణ, రోహిత్, కారుమంచి గణేష్, సత్యనారాయణ, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ప్రభుత్వం - ప్రజాపాలనకి సవాళ్లు

**- తుమ్మనపల్లి శ్రీనివాసు, రాష్ట్ర అధ్యక్షులు, లోక్‌సత్తా పార్టీ**





దేశ చరిత్రలో నిలిచిపోయేలా ప్రజాస్వామ్య పద్ధతిలో గాంధీ అనుసరించిన అహింసాయుత మార్గంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ ఏర్పడి పదేళ్లవుతోంది. బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్ రెండు దఫాల పాలనలోని వ్యవస్థీకృత లోపాలకన్నా పాలన తీరు పట్ల ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రజానీకంలో వచ్చిన వ్యతిరేకత ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశమిచ్చింది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల్ని అర్థం చేసుకుని అందుకు తగ్గ నిర్మాణాత్మక పాలన అందించలేకపోవటం, తప్పులు జరిగితే భేషజాలు లేకుండా ప్రజల ముందుకొచ్చి ఒప్పుకుని దిద్దుకోకవటం, పరిష్కారాల్లో పరిమితులుంటే ప్రజలకు నచ్చచెప్పక పోవటం వంటి ధోరణుల వల్ల బీఆర్ఎస్ మూల్యం చెల్లించింది.

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలి అడుగులు ఆశావహంగానే ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఆడంబరాలు, మితిమీరిన ధోరణులు లేకుండా సంయమనంతో వ్యవహరిస్తున్నారు. కీలక స్థానాల్లో నిజాయతీపరుల్ని, సమర్థుల్ని అధికారులుగా నియమించుకున్నారు. అధికార దుర్వినియోగాన్ని సహించనని సంకేతాలిచ్చారు. అయితే ఇప్పటికీ పార్టీలు, ఎన్నికలు, ప్రభుత్వాల సారాంశమైన తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోణంలో ఆలోచిస్తే జరగాల్సింది ఇంతేనా అన్న భావం కలుగకమానదు. ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చటానికి రేవంత్ తొలి అడుగులు పెద్ద అడుగులుగా మారి ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంది.

కొత్త ప్రభుత్వం మొదటగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టి సారించింది. ఆరు హామీల్లో రెండు వెంటనే అమలులోకి తెచ్చింది. వీటిల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం దీర్ఘకాలిక ప్రభావం, కార్మిక శక్తిలో వారి వాటాను పెంచటం మాట ఎలా ఉన్నా, ఇప్పటికైతే మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మిగిలిన గ్యారంటీల అమలుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కూడా ఒక పండుగలా జరుగుతోంది. అయితే ఇప్పటికీ పాలనాపరంగా భరోసా కలిగించలేకపోతోంది. ఒక పరిమితి దాటి ప్రభుత్వపరంగా తన కీలక బాధ్యతల్ని నిర్వర్తించలేకపోతోంది. బీఆర్ఎస్‌కు భిన్నమైన రాజకీయం తీరు, సంక్షేమ కార్యక్రమాలు, ఉచిత హామీలు తమను గట్టెక్కించాయని భావిస్తూ, ప్రభుత్వం అవి చేస్తే చాలు మరే ఇతర పనులూ ప్రభుత్వానికి లేవనుకుంటున్నట్లు కనిపిస్తోంది. మంచి పాలన సంకల్పాన్ని మాటల్లో కూడా ప్రకటించకుండా యథాలాప ధోరణితో వ్యవహరిస్తోంది. కేబినెట్ కూర్పులో కూడా నాకు హోం కావాలి, రెవెన్యూ కావాలి, ఫైనాన్స్ కావాలి, డిప్యూటీ కావాలి అని తప్ప, నాకు ఆరోగ్య శాఖ కావాలి, విద్యాశాఖ కావాలి అన్న డిమాండ్లు వినపడలేదు. ప్రజల దీర్ఘకాలిక సమస్యలపై, వారి జీవన భద్రతపై, వారి పిల్లల భవిష్యత్తుపై దృష్టి, రాష్ట్రంలో సంపద పెంపొందించాలని, ప్రజల ఆదాయాల్ని పెంచాలన్న తాపత్రయం ఎంతమాత్రం కనపబడటం లేదు.

రేవంత్ ప్రభుత్వం ముందు పలు సవాళ్లున్న మాట వాస్తవం. కానీ ప్రజల ఆదాయాలు, స్వావలంబన, తాత్కాలిక ఉపశమనాల్ని దాటి భవిష్యత్తులో ఎదిగే అవకాశాలు మొదలైన అంశాల మీద దృష్టి పెట్టకపోతే ప్రభుత్వం ఏర్పాటు వెనక అసలు లక్ష్యం దెబ్బతింటుంది.

ఉచితంగా ఇస్తే తీసుకోవాలని ఎవరికైనా అనిపిస్తుందిగానీ, ప్రజలు ఎడాపెడా ఉచితాలను కోరుకుంటున్నది వాస్తవం కాదు. ప్రజలు తమ జీవితాల్ని పణంగా పెట్టి కులమతాలకతీతంగా గుండె లోతుల్లో నుంచి కోరుకుంటున్నది తమ పిల్లలకు మంచి ప్రమాణాల విద్య అందాలని. వారు భవిష్యత్తులో వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడాలని. కానీ అలాంటి విద్య ఈవేళ తెలంగాణలో

80 శాతం మంది బిడ్డలకి అందటం లేదు. డబ్బులు ఖర్చు చేస్తున్నా అందటం లేదు. గురుకుల పాఠశాలల్లో కొంత మంచి విద్య అందుతోంది. కానీ అంతకు ఎనిమిది రెట్లు దాకా పిల్లలు బయట స్కూళ్లలో చదువుతున్నారు. గురుకుల పాఠశాల తరహాలో మిగిలిన ప్రతి పాఠశాలలో ఎందుకు అందటం లేదనే చర్చ ఇంతవరకూ రాష్ట్రంలో జరగలేదు. ఈ విషయంపై ఎన్ని కల్లో ఏ పార్టీ మాట్లాడలేదు. ఇటీవల అసెంబ్లీలో శ్వేతపత్రంలో చదివి వినిపించటం వరకే ప్రభుత్వం పరి మితమైంది.

అదేవిధంగా, గతంలో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఆరోగ్యశ్రీని బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించినా రాష్ట్రంలో ఆరోగ్యం అధ్వాన్నంగా ఉంది. పేద, మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్యం వస్తే అల్లాడిపోతున్నారు. ఆసుపత్రి ఖర్చులు భరించలేక దొరికిన కాడల్లా అప్పులు చేస్తూ పోతున్నారు. తీరా తీర్చలేక ఆస్తులు అమ్ముకుంటున్నారు. కేవలం అనారోగ్యానికయ్యే ఖర్చుల కారణంగా రాష్ట్రంలో ఏటా 19 లక్షల మంది పేదరికంలోకి జారిపోతున్నారు.

మరోవంక, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రైతేరాజు అని ప్రకటనలే తప్ప వ్యవసాయాన్ని లాభసాటిగా చేద్దామన్న ధ్యాసే లేదు. రైతుబంధు మొత్తాన్ని కొంత పెంచటం తప్ప వ్యవసాయాన్ని మౌలికంగా సంస్కరించే చర్యలు ఆరు గ్యారంటీలలో కూడా లేవు. నీళ్లు, ఉచిత విద్యుత్ అందుతున్నా వ్యవసాయం ఎందుకు సంక్షోభంలో ఉందన్న లోతైన సమీక్ష, కార్యాచరణ కావాలి.

ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఛీత్కరింపులు, పైరవీలు, సిఫారసులు లంచాలు లేకుండా పనులు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో చిత్తశుద్ధితో ప్రయత్నం జరగలేదు. పౌరులు తమ చిన్న చిన్న పనుల కోసం సైతం ఎమ్మెల్యేల మీద ఆధారపడేలా చేసుకున్న వైనం, అధికారుల తీరు జుగుప్సాకరంగా మారిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కనీసం పోలీస్ స్టేషన్‌కి వెళ్తే సవ్యంగా ఫిర్యాదు తీసుకునే పరిస్థితి లేదు. కేసు రిజిస్టర్ కావాలన్నా సిఫారసు కావాలి. భూసమస్యలపై దరఖాస్తులు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయే తప్ప పరిష్కారానికి అధికారులు ముందుకు రాకపోవడం లేదు. దీని వెనక స్వార్థ రాజకీయ కోణం దాగి ఉందని అందరూ భావిస్తున్నారు. చట్టబద్ధపాలన కరువై అధికార రాజకీయ పార్టీ అండ ఉంటేనే ఏదైనా చేయవచ్చనే ఆలోచనలు పెరిగాయి. వెగటు కలిగించే ఆడంబరాలకు, అక్రమాలకు, అక్రమార్జనకు తలుపులు బార్లా తెరుచుకున్నాయి. ఎంతోమంది మధ్యతరగతి ప్రజలు చిన్నాచితకా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ సొంత నివాసం గగనమైంది. సొంత గూడు కోసం తపన పడుతున్న మధ్యతరగతి ప్రజలకు, నిరుపేదలకు, పేదలకు రోడ్ల పక్కన, వీధులలో ఉంటున్నవారికి అన్ని సౌకర్యాలతో, మౌలిక వసతులతో, ఉపాధి కేంద్రాలుగా విలసిల్లే విధంగా గృహ సముదాయాలను పెద్దఎత్తున నిర్మించినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

ఊరూరా, పల్లెపల్లెల్లో విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్ట్ షాపులను తొలగించకపోతే రేపటి పౌరుల భవిష్యత్తు అంధకారమై తల్లిదండ్రులకు, రాష్ట్రానికి శాపంగా మారుతుంది. కుటుంబానికి ఆసరాగా, ప్రభుత్వానికి సంపద సృష్టికర్తలుగా, బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాల్సిన యువత మద్యం, డ్రగ్స్, ధూమపానం, గుట్కా మత్తులో ఊగుతోంది. ప్రభుత్వం బెల్ట్ షాపులు ఎత్తివేస్తామని, డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. కానీ విధానపరంగా ఇంకా లోతుగా ఆలోచించి చర్యలు తీసుకోకపోతే గత ప్రభుత్వంలోలాగే విఫలమవుతాయి.

అదే విధంగా, నిధులు లేక, అధికారాలు లేక, ఏమి చేయాలో తోచక సరైన ప్రణాళిక లేక గ్రామాలు అత్యంత దీనంగా మారాయి. వీధుల్లో పరిశుభ్రత కోసం, వీధి దీపాల ఏర్పాటు కోసం, మంచినీటి కోసం, రోడ్ల నిర్మాణం కోసం, చెరువుల మరమ్మతు కోసం వంటి పనులకు సైతం సకాలంలో డబ్బు గత ప్రభుత్వం చెల్లించకపోవటంతో అనేక అనర్థాలకు దారి తీసింది. (సర్పంచులు కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తారు. తీరా చేసిన అప్పులకు బిల్లులు రాక ఆత్మహత్యలకు పాల్పడటానికి సిద్ధ మయ్యారు). అలాకాకుండా గ్రామాలకు అధికారాలను దఖలు పరచి రాష్ట్ర బడ్జెట్‌లోనే వారి వాటాగా నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో పలు ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకున్న యువత, ఇతర నిరుద్యోగులు కలిపి ముప్పై లక్షల పైగా ఉన్నారు. ఇందులో వచ్చే ఉద్యోగాలు ప్రభుత్వం భర్తీ చేస్తానన్నది రెండు లక్షలు మాత్రమే. మిగతా నిరుద్యోగుల సంగతేమిటో! వారికి ఉపాధి కల్పించడం ఎలాగో ఆలోచించాలి. అందుకు మౌలిక వసతుల్ని విస్తరించి పెట్టుబడులను ప్రోత్సహించాలి. గ్రామాల మధ్యే పట్టణ సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలి. ప్రణాళికలు, అమలులో పౌర సమాజాన్ని భాగస్వాముల్ని చేయాలి.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అని తేలింది. రోజువారీ అవసరాలకు సైతం అప్పు చేయాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ చెల్లించడానికి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజల సంక్షేమాన్ని-జరగాల్సిన అభివృద్ధిని సమన్వయపరచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగెత్తించాల్సిన గురుతర బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది.

ప్రభుత్వానికి సూచనలు, సలహాలు సకాలంలో చేసి సరైన విధంగా పయనించేలా చేయాల్సిన బాధ్యత పౌర సమాజానికి, దేశ/ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును కాంక్షించే వ్యక్తులది. వ్యక్తి సమూహాలది. అవసరం అయితే ముల్లుకర్రతో పొడవాల్సిందే... ప్రజలను సమాయత్తం చేయాల్సిందే... అందుకు తగ్గ సహజ నాయకత్వాన్ని పెంపొందించుకోవాల్సిందే.

పొంచి ఉన్న సమస్యల్ని, భవిష్యత్తు సవాళ్లని, పరిష్కారాలను గుర్తించి, గొంతెత్తి, ఉద్యమించాల్సిన సమయమిది. ఈ లక్ష్యసాధనలో చురుకైన నాయకత్వాన్ని పెంపొందిం చడానికిగాను లోక్‌సత్తా పార్టీ రెండు రోజులపాటు రాజకీయ శిక్షణా శిబిరాలను నిర్వహించాలని తలపెట్టింది. త్వరలో 'ప్రజా తెలంగాణ' పేరిట ఉద్యమాన్ని ప్రారంభించనున్నామని తెలియచేయటానికి సంతోషం వ్యక్తం చేస్తున్నా. ✳

# 17A
# Prior Permission To Investigate – Prosecute

## నేర పరిశోధనకి, నేర నిరూపణకి ముందస్తుగా అనుమతులు

- పి.వి గోపాలకృష్ణ

17A అంటే చాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలామంది ప్రజలకి మరింకేం చెప్పనక్కర్లేకుండానే అదేమిటో తెలిసిపోతుందంటే, ఇటీవలి రాజకీయ పరిణామాల పుణ్యమా అని అవినీతి నిరోధక చట్టంలోని ఈ సెక్షన్ ఎంతగా ప్రచారంలో ఉందో అర్థమవుతుంది. ఓ బిచ్చగాడు ఓ అడ్వకేట్ ఇంటి ముందు నించుని ఈ సెక్షన్ గురించిన జ్ఞానం అడుక్కుంటున్నలాంటి కార్టూన్లు ఆ సెక్షన్ ప్రాచుర్యానికి అద్దం పడుతున్నాయి. ఈ ఒక్క సెక్షన్ మాత్రమే కాదు, మరికొన్ని చట్టాల్లో ఇలాటివే మరికొన్ని సెక్షన్లూ ఉన్నాయి.

ముందుగా 17A అవినీతి నిరోధక చట్టం Prevention of Corruption Act 1988 ఏం చెప్తోందీ... (ఇది సెక్షన్ 17కి అనుబంధంగా, అదనంగా ముప్ఫై ఏళ్ళ తరువాత, 2018లో ఒక చట్టసవరణ ద్వారా చేర్చబడినది).

సెక్షన్ 17 నేర పరిశోధన చెయ్యడానికి అధికారం ఉన్న పోలీసు అధికారులెవరెవరు అన్నది చెప్తుంది. సెక్షన్ 17 లోనే మరో సబ్ సెక్షన్ చేర్చి ఆ అధికారుల అర్హతని సవరించడమో లేదా మరికొంతమంది అధికారులకి అటువంటి అధికారం ఇవ్వడమో ఈ సవరణ ఉద్దేశం కాదు. నేరపరిశోధన దశలోనే సెక్షన్ 17లో చెప్పబడిన పోలీస్ అధికారులు ఆయా రాష్ట్ర లేక కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి విచారణా జరుపరాదు అని చట్టంలో చేర్చాలన్నదే ఈ 17A ఉద్దేశం. నేర పరిశోధన – investigation నేర నిరూపణ - prosecution - ఈ రెండు దశల్లో రెండవ దశలో – కోర్టులో prosecution దశలో – ఇటువంటి ఆవశ్యకత ఈ అవినీతి నిరోధక చట్టం, సెక్షన్ 19లో అప్పటికే ఏర్పాటు చేసి ఉంది. రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాల ముందస్తు అనుమతి లేకుండా (ఈ చట్టంలోని) ఏ నేరాన్ని ఏ కోర్టూ పరిగణలోనికి తీసుకోరాదు అన్నది సెక్షన్ 19 సారాంశం. అయితే వివిధ రాజకీయ కారణాల ప్రోద్బలంతో చట్టాన్ని వంచి, తుంచి, అణచివేసి – subversion of law- కి పాల్పడి, ప్రత్యర్థుల మీద ప్రతీకారం తీసుకునే దురుద్దేశాలున్న రాజకీయ నాయకుల సంఖ్య పెరుగుతూన్న విషయ గ్రహింపు వల్లో, కోర్టుల విలువైన సమయాన్ని వృధాపరచకూడదన్న సదుద్దేశంతోనో ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి విచారణ కూడా జరపకూడదన్న సవరణ చట్టంలో పొందుపరిచేరు.

సెక్షన్ 197 CrPC తమతమ విధినిర్వహణలో భాగంగా చేసిన పనులకి సంబంధించి ప్రజాసేవకులు, జడ్జీలు, మేజిస్ట్రేట్‌లు ఎదుర్కొంటున్న ఏ విధమైన నేరాభియోగాన్నీ ముందస్తు ప్రభుత్వ



అనుమతి లేకుండా ఏ కోర్టూ పరిగణలోకి తీసుకోరాదు అని చెప్తోంది. దర్యాప్తు చెయ్యడానికి కూడా ముందస్తు అనుమతి ఉండాలి అన్న నిబంధన జబితాలో లేదు.

లోక్‌పాల్ చట్టం 2013 – ఏ ప్రజాసేవకుడిపైనయినా ఫిర్యాదు అందుకున్న అనంతరం దర్యాప్తు – నేర విచారణ, నేర నిరూపణ చర్యలు – prosecute – చేసే ఆజ్ఞలు విధించే అధికారం లోక్‌పాల్‌కి ఉన్నాయి.

**ప్రభుత్వం న్యాయవ్యవస్థల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న టగ్ ఆఫ్ వార్**

Vineet Narain vs. Union of India 1997 - 1969 "Single Directive" No.4.7 (3) -

అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారులు తమ విధినిర్వహణలో భాగంగా చేసిన పనులలోని నీతి, అవినీతి, న్యాయాన్యాయ, ధర్మాధర్మ నిబద్ధతలని దర్యాప్తు సంస్థలు అంచనా వెయ్యడానికి దర్యాప్తు చెయ్యడం కూడా నిరోధించే విధంగా, అటువంటి అభియోగాలు ఎదుర్కొంటున్న అధికారులకి రక్షణ కవచంగా చట్టాలను ప్రభుత్వాలు చెయ్యడం అన్నదానికి తొలి ప్రయత్నం 1969లో వచ్చిన ఈ సింగిల్ డిరెక్టివ్. అప్పటికే వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ శాఖలు తమ తమ పరిధిలోని అధికారులని విచారించడానికి, దర్యాప్తు చెయ్యడానికి, కేసులు నమోదు చెయ్యడానికి CBI అనుసరించాలని చేసిన మార్గదర్శక సూత్రాలన్నింటినీ క్రోడీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నిర్దేశక పత్రం ఈ సింగిల్ డిరెక్టివ్. ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, నేషనలైజ్డ్ బ్యాంకులలోని అధికారులని విచారించడానికి ముందస్తుగా అధీకృత అధికారి అనుమతి పొందడం తప్పనసరి చేసిందీ సింగిల్ డిరెక్టివ్. దీనికి ప్రభుత్వం చెప్పిన కారణం అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులను, వారు తీసుకున్న నిజాయతీ నిర్ణయాలను, పనికిమాలిన అనవసరమైన నిర్లక్ష్యపు విచారణలు, దర్యాప్తులు, కేసులకి బలిపశువులు కాకుండా పరిరక్షించడం. అటువంటి రక్షణ లేకపోయినట్లయితే

ప్రభుత్వ సంస్థల సామర్థ్యం సన్నగిల్లిపోతుంది. తాము తీసుకునే నిర్ణయాల పర్యవసానం పనికిమాలిన దర్యాప్తులు, వేధింపులకి దారితీసే అవకాశముందంటే అధికారులందరూ నిర్ణయాలు తీసుకోవడంలో అలసత్వం లేదా దాటవేత ధోరణి ప్రదర్శిస్తారు.

ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ సింగిల్ డిరెక్టివ్ కారణంగా CBI కేసులు నత్తనడక నడుస్తూండడంతో వినీత్ నారాయణ్ అన్న జర్నలిస్ట్ ఈ నిర్దేశక సూత్రాల రాజ్యాంగబద్ధతను కోర్టులో ప్రశ్నించిన పర్యవసానంగా 1997లో ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఈ సింగిల్ డిరెక్టివ్‌ను రద్దు చేసింది. సింగిల్ డిరెక్టివ్ నిర్ణయాధికారం ఉన్న కొద్దిమంది అధికారులకి మాత్రమే పరిమితం అన్న ప్రభుత్వ వాదనని కోర్టు కొట్టిపడవేసింది. నేరం చేసినది జూనియర్ అధికారి అయినా, సీనియర్ అధికారి అయినా చట్టం ముందు సమానమే. చట్టం అందరినీ సమదృష్టితోనే చూస్తుంది. ఒకరి ప్రవర్తన నేరపూరితమైనదిగా ఉంటే, తక్షణం అది విచారణార్హమైనది, అటువంటి నేరస్తుడి మీద నేర నిరూపణ చర్యలు త్వరితగతిన చేపట్టినప్పుడే చట్టం దాని పని అది సక్రమంగా చేసినట్లు, చట్టబద్ధపాలన సమర్థంగా నిర్వహించినట్టు భావించగలం అన్నది కోర్టు చెప్పినదాని సారాంశం. సింగిల్ డిరెక్టివ్ చెల్లదనడానికి కోర్టు చెప్పిన మరో కారణం – శాసనపరమైన సామర్థ్యం (Delhi Special Police Establishment Act, 1946, ద్వారా) చట్టబద్ధంగా CBI కి దఖలు పడ్డ అధికారాలలో పరిపాలనా పత్రం ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం.

DSPE Act, 1946 కి 2003లో చేసిన ఒక సవరణ ద్వారా చొప్పించిన సెక్షన్ 6A నిబంధన ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి లేకుండా జాయింట్ సెక్రటరీ స్థాయికి పైబడిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర చట్టాల ద్వారా స్థాపించబడిన కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్లు, ప్రభుత్వ కంపెనీలు, సొసైటీలలో నియమింపబడిన అధికారులు, (కేంద్ర) ప్రభుత్వాధీనంలో ఉండి ప్రభుత్వ యాజమాన్యంలో స్థానికం ఉండే అధికారుల మీద ఉన్న నేరాభియోగాలను *DSPE (అనగా CBI) విచారించడమో, దర్యాప్తో చేయకుండా ఏర్పాటు చేసింది. పదేళ్లపాటు ఇది చట్టంగా అమలైన తరవాత దీని రాజ్యాంగబద్ధతని Subramanian Swamy vs Director, CBI & Another కేసులో ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం సమీక్షించింది. మే 6, 2014 నాడు ఈ నిబంధన ఆర్టికల్ 14 లోని equality of law – equal protection under law – చట్టం ముందు అందరూ సమానమే – చట్టం అందరికీ సమానంగా వర్తించాలి అన్న రాజ్యాంగ సూత్రాన్ని అతిక్రమిస్తున్నదని, అందువల్ల ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని నిర్ణయించింది. అవినీతి ఆరోపణలున్న జాయింట్ సెక్రటరీ అంతకు పైబడిన అధికారులను నిరాటంకంగా CBI విచారణ లేకుండా అంతస్తు, స్థాయిలు రక్షణ కవచాలు కాజాలవు. దర్యాప్తు చెయ్యడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేసిన ఈ నిబంధనని 2014లో కోర్టు కొట్టివేసింది. ఈ నిబంధన వివక్షాపూరితమైనదిగాను, అవినీతి అధికారుల వెంటబడటానికి ప్రతిబంధకమైనదిగాను, పైపెచ్చు అటువంటి అధికారుల పాలిటి రక్షణ కవచంగానూ ఉందని కోర్టు అభివర్ణించింది.

దీని పర్యవసానంగా Central Vigilance Commission Act ( Act 45) of 2003 లోని సెక్షన్ 26కి కూడా ఈ తీర్పు వర్తిస్తుందని ధర్మాసనం నిర్ణయించింది.

ఈ సెక్షన్ 6 Aలోని నిబంధనకి రాజ్యాంగబద్ధత లేదన్న సుప్రీంకోర్ట్ నిర్ణయం 2003లో చట్టసవరణ చేసిన నాటి నుంచి రెట్రాస్పెక్టివ్‌గా అమలవుతుందని, సెప్టెంబర్ 2003 – మే 2014 మధ్యకాలంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న 'ప్రజాసేవకుల' (public servants) అవినీతి కేసుల investigation కి prosecution కి ప్రభుత్వ అనుమతి అనవసరమని ఈమధ్యే, పదేళ్ళ తరవాత, గత (2023) సెప్టెంబర్ 11 నాడు జస్టిస్ సంజయ్ కిశన్ కౌల్ అధ్యక్షతన మరో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, CBI vs R.R.Kishore అన్న కేసులో స్పష్టతనిచ్చింది.

ఇప్పుడు ప్రజలందరి నోట – తెలుగు ప్రజలందరి నోట నానుతున్న అవినీతి నిరోధక చట్టం – Prevention of Corruption Act - 17A నిబంధన, ఏదైతే 2014లో, అంతకు పూర్వం 1997లో సుప్రీంకోర్ట్ రాజ్యాంగబద్ధం కాదని కొట్టివేసిందో అదే పనిని తిరిగి జులై 26, 2018 నాడు అవినీతి నిరోధక చట్టానికి సవరణ ద్వారా సాధించడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నం. 'ప్రజాసేవకుల' పరిరక్షణార్థం. ఏ పోలీసు అధికారీ, విధినిర్వహణలో భాగంగా ఏ పబ్లిక్ సర్వెంట్ తీసుకున్న నిర్ణయానికో, సూచనకో, సలహాకో సంబంధించిన ఏ నేరారోపన దర్యాప్తూ, ఆయా రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం లేదా ఆ ప్రజాసేవకుడిని తొలగించే అధికారం ఉన్న వ్యక్తి నుంచి ముందస్తు అనుమతి లేకుండా, చేయరాదు అని సవరించిన ఈ చట్టం చెప్తోంది. దీనివల్ల పదవిలో ఉన్న లేదా పదవీ విరమణ పొందిన అన్ని రకాల ప్రభుత్వోద్యోగులకు – ప్రజా సేవకులకు (పబ్లిక్ సర్వెంట్లు) – ఈ నిబంధన రక్షణ కవచంగా మారింది. DSPE Act, 1946, సెక్షన్ 6A లోని ప్రభుత్వోద్యోగుల మధ్య స్థాయి, అంతస్తు, వర్గ భేదాలని PC Act, 1988, సెక్షన్ 17A లో ఈ సవరణ ద్వారా చెరిపివేసింది. ఆ విధంగా సమానత్వాన్ని చూపించింది. కానీ ఒకే రకమైన నేరారోపణలనెదుర్కొంటున్న సామాన్యుడికి, అధికారికి మధ్యన చట్టం చూపిస్తున్న వివక్ష కొనసాగుతూనే ఉంది. Equality of law and equal protection under law అందరికీ సమానంగా వర్తించాలి.

"ఏ పోలీసు అధికారీ enquiry or inquiry or investigation నిర్వహించరాదు (without the previous approval – ") అన్న ఈ పదప్రయోగంలోని విశిష్టార్థాన్ని అర్థం చేసుకోవాలి. ఇంగ్లీషు భాషలో enquiry, inquiry అన్న పదాలని సందర్భాన్ని బట్టి ప్రయోగించాలి. సాధారణ సమాచార సేకరణకి, లోతైన దర్యాప్తుకి తేడా ఉంటుంది. నేర పరిశోధన విచారణ మరింత

లోతుగా విస్తృతంగా ఉంటుంది. ఈ సవరణ ఉద్దేశం ఈ పోలీసు అధికారీ ఎటువంటి విచారణ, దర్యాప్తు, పరిశోధనా చెయ్యకుండా నిరోధించడం. ఈ ప్రభుత్వాధికారి (పదవిలో ఉన్నా, లేకపోయినా) తీసుకున్న నిర్ణయంకానీ, సూచనగానీ, సలహాగానీ ఏవీ కూడా ఏ పోలీసు అధికారీ ముందస్తు ప్రభుత్వ అనుమతి లేకుండా విచారించరాదు. దర్యాప్తు చేయరాదు. పరిశోధించరాదు. ఇది, ముందస్తు అనుమతి లేకుండా అవినీతి నిరోధక చట్ట పరిధిలోని నేరాన్ని ఏ కోర్టూ పరిగణలోకి తీసుకోరాదు అన్న సెక్షన్ 19లోని నిబంధనకి ముందస్తుగా.

ఇక ఈ నిబంధనలోని ఒక ప్రొవైసోలో కాలపరిమితికి సంబంధించిన నిబంధన కూడా ఉంది. మూడు నెలలలోపుగా సంబంధించిన తన నిర్ణయాన్ని తెలియజేయవలెను. తగిన కారణాలను రాతపూర్వకంగా చూపించినట్లైన ఆ పరిమితి మరో నెల వరకు పొడిగించవచ్చు. కానీ నాలుగు నెలల కాలపరిమితి కూడా దాటిపోయినట్లైతే ఏం చెయ్యాలో చట్టం చెప్పదు. ఆ విధంగా సంబంధిత పోలీసధికారి చేతులు కట్టివేయబడిన సందర్భాలు అనేకం. 2G scam సందర్భంలో A.Rajaను prosecute చేయడానికి 16 నెలల తరవాత కూడా అనుమతి రాని పరిస్థితిలో సుబ్రమణియన్ స్వామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. Subramanian Swamy vs Dr. Manmohan Singh & Another లో సుప్రీంకోర్ట్, మూడు నెలల కాలపరిమితి తరవాత కూడా ప్రభుత్వం అనుమతి నిర్ణయం తీసుకోకపోతే అనుమతి ఇచ్చినట్టే అని భావించే విధంగా పార్లమెంట్ చట్టం సవరణ చేసే అవకాశాన్ని పరిగణించాలన్న సూచననీ చేసింది.

Centre for Public Interest Litigation సహా మరికొందరు 17A, PC Act, రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఐదేళ్ళ క్రితమే దాఖలు చేసిన పిటిషన్లు కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తూ ఉన్నవి. రాజ్యాంగబద్ధత అన్న బలమైన పునాది లేకపోతే 17A కూడా 6A వలెనే రాజ్యాంగ ధర్మాసన న్యాయసమీక్షలో కుప్పకూలితే ఆశ్చర్యపోడానికి ఏం ఉంది, అభ్యంతరం చెప్పడానికి ఏం ఉంది?

అలాగే సర్వోన్నత న్యాయాధీశులు కూడా కాలపరిమితులు, సమయపాలనకు లోబడి తీర్పులను వెలువరించినట్లైతే, తామే సూచించినట్లు, భవిష్యత్తులో, కొండొకచో, పార్లమెంట్ 'deemed sanction' ని చట్టరూపంలోకి తెస్తే, కాలపరిమితి దాటిన వెంటనే పిటిషనర్లు కోరుకున్న విధంగా శ్రీ కోర్టువారు తీర్పును వెలువరించినట్లుగాను భావించే సావకాశాన్ని కూడా ఆ చట్టంలో పొందుపరచవలసి ఉంటుంది.

ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా దగ్గర్నుంచి క్లాస్ ఫోర్ ఎంప్లాయీ దాకా అందరూ రాజ్యాంగబద్ధులై, చట్టబద్ధపాలనకు బద్ధులై, ప్రభువులకు సేవకులై విధులను నిర్వర్తించవలసిందే. అందరూ ప్రజాసేవకులే. వారిలో కొందరు ప్రజాకంటకులుగా మారినప్పుడు, రాజ్యాంగ ఉన్నత పదవులనధిష్టించి, కళ్ళు మూసుక్కూర్చున్నవారు కూడా ప్రజాకంటకులే.

న్యాయ, శాసన, కార్యనిర్వాహకం అన్న మూడు రాజ్యాంగ వ్యవస్థల నిర్వహణ బాధ్యత వహిస్తున్న ప్రజా సేవకులు – అధికారులు, న్యాయాధికారులు/న్యాయమూర్తులు/న్యాయాధీశులు – తమ తమ బాధ్యతలలో భాగంగా తమకు తాముగా విధించుకున్న లేదా చట్టం విధించిన కాలపరిమితుల లోపల తమ నిర్ణయాలను వెలువరించనిపక్షంలో, కాలపరిమితి దాటిన మరుక్షణం ఆటోమేటిక్‌గా ఆయా దరఖాస్తుదారులు, ఫిర్యాదుదారులు, పిటిషనర్లు, వాదులు, కోరుకున్న ఉపశమనం (relief), పరిహారం (compensation) తక్షణం అమలయ్యే విధంగా చట్టం రూపొందించవలసిన అవసరం ఉంది.

సమర్థులైన, నీతిమంతులైన ప్రజాసేవకులను వివిధ రాజకీయ కారణాల ప్రోద్బలంతో చట్టాన్ని వంచి, తుంచి, అణచివేసి – subversion of law కి పాల్పడి, ప్రతీకారం తీసుకునే దురుద్దేశాలతో దాఖలయ్యే పనికిమాలిన, అనవసరమైన, నిర్లక్ష్యపు విచారణలు, దర్యాప్తులు, కేసులకి, వేధింపులకి బలిపశువులు కాకుండా పరిరక్షించవలసినదే. అటువంటి చట్టాన్ని స్వార్థం కోసం దుర్వినియోగపరచేవారి నియంత్రణకి, అధికార దుర్వినియోగం, బాధ్యతారహిత ప్రవర్తన నియంత్రణకి The Subversion of Law, Abuse of Power and Dereliction of Duty (Regulation) ని చట్టరూపంలో ముందుగా తీసుకురావలసిన అవసరం ఉంది. అటువంటి సంఘవిద్రోహక చర్యలకి తగిన కఠిన శిక్షలు తక్షణం అమలుపరచే విధంగా. ఈ శిక్షల ఉద్దేశం సంస్కరణ, నివారణ కాదు. తప్పు చేసిన వాడు శిక్ష అనుభవించాలి.

నేర పరిశోధన, నేర నిరూపణ నిమిత్తం చట్టపరంగా అవసరమైన ముందస్తు అనుమతులు, కేవలం ఆయా నేరాభియోగాలను ఎదుర్కొంటూ సేవకులు ఉద్యోగ విధులను నిర్వహించలేనప్పుడు, ప్రజాసేవ కుంటుపడకుండా తగిన ప్రత్యామ్నాయ చర్యల నిమిత్తమే తప్ప ఆయా ఉద్యోగుల స్థాయి, గౌరవ మర్యాదలకి సంబంధించిన విషయం కాదన్నది కూడా చట్టం రూపంలో నిశ్చయపరచడం అవసరం.

చట్టం నిర్ణయించిన కాలపరిమితి (లేదా తమ దృష్టికి వచ్చిన వారం రోజులు) దాటకుండా తగిన నిర్ణయాలను సంబంధిత పై అధికారులు (స్పీకర్లు, గవర్నర్లు, ప్రెసిడెంట్ ఇత్యాదులు సహా) తీసుకోకపోయినట్లయితే, కాలపరిమితి దాటిన మరుక్షణం ఆయా అధికారుల నిర్ణయాలతో ప్రమేయం లేకుండా తగిన అనుమతి మంజూరయిపోయినట్లేనని భావించే విధంగా నిబంధనలుండే చట్టం రూపకల్పన జరగాలి. సమయానుకూలంగా, కాలపరిమితులకు లోబడి బాధ్యతలు నిర్వర్తించేవారే సమర్థులుగా గుర్తించాలి. ఆ విధంగా సమయపాలనకి విరుద్ధంగా ప్రవర్తించే ప్రజాసేవకులను తక్షణం తొలగించేలా చట్టాల రూపకల్పన జరగాలి.

1969 సింగిల్ డిరెక్టివ్ రూపంలో పాదుకున్న ఈ దుష్టసంప్రదాయం ఫలితంగా పోలీసు శాఖ నిష్పక్షపాతంగా, జవాబుదారీతనంతో, చట్టబద్ధంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం

జనంలో సన్నగిల్లిపోయింది. ఈమధ్య విజయవాడలో జరిగిన ఒక సమావేశంలో న్యాయవాదులపై పెరుగుతున్న భౌతిక దాడులు, అక్రమ కేసులు, హత్యల నేపథ్యంలో, వారి పరిరక్షణకు, (రాజస్థాన్ తరహాలో!?) ఒక రక్షణ చట్టాన్ని చేయాలని తీర్మానించారు. పోలీసు స్టేషన్‌లో న్యాయవాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నా ముందుగా స్థానిక బార్ అసోసియేషన్ అనుమతితోనే చర్యలకు ఉపక్రమించాలని తీర్మానించారు. పోలీస్, CB-CID, CBI, ED వంటి దర్యాప్తు సంస్థలు తమ స్వతంత్ర ప్రతిపత్తిని, చట్టబద్ధ నడవడిని రాజకీయ స్వార్థాలకు తాకట్టుపెడితే, ఇక డాక్టర్లు, చార్టర్డ్ ఇంజినీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆఖరికి స్ట్రీట్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లు కూడా వారి ముందస్తు అనుమతితోనే చర్యలకు ఉపక్రమించే విధంగా చట్టాలు కావాలని కోరుకోవడమే తరువాయి.

ఈ 6A, 17A వంటి సెక్షన్‌ల పరమార్థం ఏమిటీ? సమర్థులైన, నిజాయతీపరులైన ప్రజాసేవకుల పట్ల ఎవరైనా చట్టాన్ని వంచి, తుంచి, అణచి దుర్మార్గంగా అక్రమంగా వ్యవహరించడాన్ని అరికట్టడం, ప్రజాసేవకులు జవాబుదారీతనంతో విధులు నిర్వహించగలిగే వాతావరణం కల్పించడమని ఆయా చట్టాలలో శాసనకర్తల ఉద్దేశంగా చెప్పి ఉండవచ్చు. కానీ గణతంత్ర దేశం `Republic – లో ప్రజలే ప్రభువులు. ప్రభువుల నిరంతర, నిరంతరాయ సేవే సేవకుల కర్తవ్యం. ప్రజాసేవకులు ఆ విధంగా నిరంతరం, నిరాటంకంగా సేవలందించాలని శాసించడమే శాసనసభల పరమోద్దేశం కావాలి. ఆ ఉద్దేశ సాధన కోసమే వివిధ చట్టాల్లో ఇటువంటి సెక్షన్ల రూపకల్పన జరగాలి. అంటే, నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వోద్యోగి – ప్రజాసేవకుడి – మీద దర్యాప్తుకి అనుమతి ఇవ్వడం, ఇవ్వకపోడం అన్నది ఆ సేవకుడి స్థాయి, సంఘంలో పలుకుబడి, అంతస్తు, అత్యున్నత IAS, IPS విద్యార్హతలు అన్నవాటి మీద ఆధారపడకూడదు. ఆ ఉద్యోగిని, సేవకుడిని తాత్కాలికంగా పదవి నుంచి తప్పిస్తే ఏ విధమైన ప్రత్యామ్నాయాలు ప్రభువుల నిరంతర, నిరాటంక సేవకి ఏర్పాటు చేయాలన్నది ఆలోచించుకుని తగిన ఏర్పాట్లు చేయడానికి తగినంత సమయాన్ని చట్టంలో ఏర్పాటు చెయ్యాలి. సేవకులు కూడా నిరంతర సేవాతత్పరతతో కాలపరిమితులను తూచ తప్పకుండా పాటించాలి.

కానీ ఆచరణలో ఆ పరమోద్దేశం రాజకీయ అహంకార జ్వాలలలో ఆహుతైపోయింది. వారి వారి పదవులు స్థాయిలని పరిరక్షించుకోడానికి, పరీక్షించుకోడానికి ఆ సెక్షన్‌ల వినియోగం లేదా దుర్వినియోగం సామాన్యమైపోయింది.

**పిడకల వేట**

తెలుగులో తీర్పులు, తెలుగులో చట్టాలు. వినడానికి గొప్పగా, భాషాభిమానం నాకు కద్దని చెప్పుకోడానికి బాగానే ఉన్నా, అవి నిజంగా జనానికి అంత ఉపయోగకరంగా ఉన్నాయా అంటే, తెలుగులో ఉన్న సెక్షన్ 17A ఒకసారి చదివి ఈ ప్రశ్నకి జవాబు దొరుకుతుందేమో మీరే చూడండి. ఇది లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ లా అండ్ జస్టిస్,, భారత ప్రభుత్వం వారి 'ఇండియా కోడ్' `India Code వెబ్‌సైట్ నుంచి సేకరించినది.

-17A

అధికారిక విధులు లేదా విధుల నిర్వహణలో పబ్లిక్ సర్వెంట్ చేసిన సిఫార్సులు లేదా తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన నేరాల విచారణ లేదా విచారణ లేదా విచారణ.

1.(17A. అధికారిక విధులు లేదా విధుల నిర్వహణలో పబ్లిక్ సర్వెంట్ చేసిన సిఫార్సులు లేదా తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన నేరాల విచారణ లేదా విచారణ లేదా విచారణ. -- ఏ పోలీసు అధికారి ఈ చట్టం కింద ప్రభుత్వ సేవకుడు చేసినట్టు ఆరోపించబడిన ఏదైనా నేరంపై ఎటువంటి విచారణ లేదా విచారణ లేదా విచారణను నిర్వహించకూడదు, ఆరోపించిన నేరం అటువంటి ప్రభుత్వ ఉద్యోగి చేసిన సిఫారసు లేదా నిర్ణయానికి సంబంధించినది. మునుపటి ఆమోదం లేకుండా అధికారిక విధులు లేదా విధులు--

(ఎ) ఆ ప్రభుత్వం యొక్క యూనియన్ వ్యవహారాలకు సంబంధించి, నేరం జరిగినట్లు ఆరోపించబడిన సమయంలో, ఉద్యోగం చేస్తున్న లేదా ఉద్యోగం చేస్తున్న వ్యక్తి విషయంలో;

(బి) ఆ ప్రభుత్వం యొక్క రాష్ట్ర వ్యవహారాలకు సంబంధించి, నేరం జరిగినట్లు ఆరోపించబడిన సమయంలో, ఉద్యోగంలో ఉన్న లేదా ఉద్యోగం చేస్తున్న వ్యక్తి విషయంలో;

(సి) నేరం జరిగినట్లు ఆరోపించబడిన సమయంలో, అతడిని అతని కార్యాలయం నుండి తొలగించగల సమర్థత కలిగిన ఇతర వ్యక్తి విషయంలో;

తనకు లేదా మరే ఇతర వ్యక్తికి ఏదైనా అనవసరమైన ప్రయోజనాన్ని అంగీకరించడం లేదా అంగీకరించడానికి ప్రయత్నించడం అనే ఆరోపణపై అక్కడికక్కడే ఒక వ్యక్తిని అరెస్టు చేసే కేసులకు అటువంటి ఆమోదం అవసరం లేదు:

ఇంకా అందించబడినట్లయితే, సంబంధిత అధికారి ఈ సెక్షన్ కింద మూడు నెలల వ్యవధిలో తన నిర్ణయాన్ని తెలియజేయాలి, అటువంటి అధికారం ద్వారా రాతపూర్వకంగా నమోదు చేయడానికి కారణాల వల్ల, మరో నెల వ్యవధి పొడిగించవచ్చు.)

ఇప్పుడు ఇంగ్లీషులో చదవండి:

Section 17A. Enquiry or Inquiry or investigation of offences relatable to recommendations made or decision taken by public servant in discharge of official functions or duties. 1[17A. Enquiry or Inquiry or investigation of offences relatable to recommendations made or decision taken by public servant in discharge of official functions or duties.-- No police officer shall conduct any enquiry or inquiry or investigation into any offence alleged to have been committed by a public servant under this Act, where the alleged offence is relatable to any recommendation made or decision taken by such public servant in discharge of his official functions or duties, without the previ-

ous approval (a) in the case of a person who is or was employed, at the time when the offence was alleged to have been committed, in connection with the affairs of the Union, of that Government;
Page 16 of 17
(b) in the case of a person who is or was employed, at the time when the offence was alleged to have been committed, in connection with the affairs of a State, of that Government; (c) in the case of any other person, of the authority competent to remove him from his office, at the time when the offence was alleged to have been committed: Provided that no such approval shall be necessary for cases involving arrest of a person on the spot on the charge of accepting or attempting to accept any undue advantage for himself or for any other person: Provided further that the concerned authority shall convey its decision under this section within a period of three months, which may, for reasons to be recorded in writing by such authority, be extended by a further period of one month.]

ఇప్పుడు ప్రేక్టీస్ చేస్తున్న అడ్వొకేట్లే తెలుగులో ఉన్నది చదివి అర్థం చేసుకోగలరని అనుకోను. మిగతావన్నీ పక్కన పెడదాం. అసలు ఎందుకని మొదటి వాక్యంలో విచారణ, విచారణ, విచారణ అని మూడుసార్లు ఉంది? ఇంగ్లీషులో ఉన్నది చదివితే అర్థం అవుతుంది. ప్రేక్టీస్ చేస్తున్న అడ్వొకేట్లకి, అందునన్ కొందరికి. ఇక సామాన్యులకి తెలుగులో ఉన్నది కొరకరాని కొయ్య. ఆమధ్య ఎప్పుడో ఓ పత్రిక ఏదో వార్తకి పెట్టిన హెడ్డింగ్ – "ఇనుప గుగ్గిళ్ళు ఈ తెలుగు పదాలు".

❊





ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన నాయకులు లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌ను హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జేపీ తాజా రాజకీయ పరిణామాలు, సంస్థ బలోపేతం తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ సమావేశంలో ఉభయరాష్ట్రాల లోక్‌సత్తా కన్వీనర్ బండారు రామ్మోహనరావు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్, పందిళ్ల శంకర్, పార్థసారథి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎన్నికలు - పౌర సమాజం

ప్రభుత్వాల కంటే ప్రజలు బలంగా ఉండటం, ప్రభుత్వాలకు పౌర సమాజం దిశానిర్దేశం చేయటం ప్రజాస్వామ్య పరిణతికి నిదర్శనం. పాలన, రాజకీయం వంటి అంశాలపై పౌర స్వచ్ఛంద సంస్థలు చేసే కృషి సాధారణంగా దీర్ఘకాలంగా ఉంటుంది, ఆ కృషిని, చాలా సందర్భాల్లో సాధించే ఫలితాల్ని అంత సులభంగా గణించలేము. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, ఆదాయాలు తక్కువగా ఉండే మనలాంటి దేశంలో తక్షణావసరాలకి సాయం చేసే స్వచ్ఛంద సంస్థల గురించే ప్రజల్లో ఎక్కువ ప్రచారం ఉంటుంది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఆయా సంస్థల పనిని చూసి, ఫలితాలను పరిశీలించగలిగే సంస్థల గురించి తెలిసినంతగా రాజకీయ సంస్కరణల మీద కృషి చేసే సంస్థల గురించి తెలియదు. దానికితోడు అధికారాన్ని పూజించే, ప్రభుత్వం అంటే దేవుడు, ఏదైనా చేయగలదు అని నమ్మే సమాజం మనది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాల్ని, రాజకీయ పార్టీల్ని అవసరమైతే విమర్శిస్తూ సరైన దిశగా నడిపించే హేతుబద్ధ విధానాలను వివరిస్తూ ప్రజల్ని సమీకరించటం ఏ స్వచ్ఛంద సంస్థకైనా పెద్ద సవాలే.

ప్రజానీకంలో ప్రచారం ఏ మేరకు ఉన్నా, గత పదేళ్ల వరకు మన సమాజంలో కాస్త ఆలోచించగలిగినవారు, సొంత వనరులున్నవారితోపాటు ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు కూడా పౌర సమాజ కృషికి ప్రాధాన్యత ఇచ్చేవారు. విద్యావ్యవస్థ ఘోరవైఫల్యం వల్ల విశ్వవిద్యాలయాల నుంచి నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు కొరవడటంతో పౌర సమాజ సంస్థల ఆలోచనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ ఇటీవల అధికార కేంద్రీకరణ, ఎన్నికల్లో డబ్బు, తాత్కాలిక పథకాల రాజకీయం పెరిగిపోవటం, ప్రజాభిప్రాయాన్ని పారదర్శకంగా మలచకుండా ప్రచార సాధనాలు, సోషల్ మీడియాతో కృత్రిమంగా నిర్మించటం వంటి కారణాల వల్ల పౌర సమాజం ప్రతిపాదించే విధానాల కన్నా రాజకీయ కన్సల్టెన్సీలకే పార్టీలు, నేతలు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి దశాబ్దాలపాటు లైసెన్స్ పర్మిట్ ఆర్థిక వ్యవస్థ, కుహనా సోషలిజం వల్ల ఎక్కువగా ప్రభావితమైన మన పౌర సమాజ సంస్థల దీర్ఘకాల ఆలోచనా దృష్టిని ఈ వైకల్యం మరింత దెబ్బతీసింది. లోతైన అధ్యయనం చేయకుండా, ప్రచార కండూతితో మాట్లాడటం, హేతుబద్ధ విధాన కారణాలు లేకుండా ఏదోక పార్టీ వైపు మొగ్గు చూపటం వంటి పెడధోరణులు ఎక్కువయ్యాయి. ఇలాంటి పరిస్థితుల మధ్యే 2023 ఎన్నికల్లో పౌర సమాజ సంస్థలు, నేతలు చురుకైన పాత్ర పోషించారు.

ఎన్నికల్ని ప్రభావితం చేసేలా రాజకీయాలలో పౌర సమాజం గణనీయ పాత్ర పోషించటం మన దేశంలో కొన్ని దశాబ్దాలుగా



ఉంది. ఎమర్జెన్సీ సమయంలో పౌర సంస్థల, నేతల పాత్ర కీలకమైనది. కానీ సోషలిజం పేరుతో కుహనా సోషలిజం తీసుకొచ్చి దేశంలో విద్య, ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా కొన్ని తరాల్ని భ్రష్టు పట్టించిన ఆలోచనా ధోరణులు కొనసాగటం వల్ల విధానాల గురించిన చర్చ కొరవడింది. అదేవిధంగా ఆర్థిక వ్యవస్థను, ప్రజల ఆదాయాల్ని ఎదగనీయకుండా చేసిన లైసెన్స్-పర్మిట్ రాజ్ ప్రభావం ఇంకా తొలగలేదు. దీంతో పాతికేళ్ల స్వతంత్ర భారతంలో ఎక్కడ తప్పు జరిగింది అనే లోతైన చర్చ కొరవడింది. ప్రభుత్వంలాగే పౌర సమాజం కూడా సాంప్రదాయ రాజకీయ ధోరణితో వ్యవహరించింది. వ్యవస్థీకృత పరిష్కారాల గురించి కాకుండా కేవలం ఒక పార్టీని లేదా ఒక వ్యక్తిని గద్దె దించటం చుట్టూనే పోరాటం సాగించింది.

1990ల దశకంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాక పౌర సమాజ సంస్థల చర్చ కుహనా సోషలిజం పరిధిని దాటి విస్తృతమైనా రాజకీయ ఎజెండాను మౌలికంగా మార్చటం, ప్రభుత్వం చేయాల్సిన పనులు ఏమిటో స్పష్టంగా నిర్వచించటం, ఫ్యూడల్ రాజకీయ సంస్కృతిని మార్చి పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం తేవటం వంటి అంశాలను చర్చకు తేలేదు. ఓటింగ్ అండ్ షౌటింగ్ రాజకీయ ప్రవాహంలో కొట్టుకుపోయారు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగబద్ధ

పద్ధతుల్లో నిరసనలు, పోరాటాలు ఉండాలని డా॥ అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నా, వలస పాలన కాలంలో అనుసరించిన హర్తాళ్‌లు, రాస్తారోకోలు, బంద్‌లు వంటి పద్ధతుల్లోనే ఆందోళలను కొనసాగిస్తూ ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతిని బలహీన పరచారు. అయితే, పార్టీలు, వ్యక్తుల చుట్టూ తప్ప వ్యవస్థ చుట్టూ వాదనలు చేయకున్నా, ఆయా సంస్థల ప్రతినిధుల ఆచరణలో నిబద్ధత, ఆలోచనల్లో పదును ఉండేవి. అస్తిత్వ రాజకీయాలున్నా అవి ప్రజల సాధికారతపై ఆలోచన పెంచేవిగా ఉండేవి. కానీ ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఉన్నకొద్దీ పెరగటం, అస్తిత్వ ఉద్యమాలను కుల పంచాయతీలుగా మార్చేసి అణగారిన వర్గాల విముక్తి మార్గాన్ని విస్మరించటం, మత పంచాయతీ రాజకీయాన్ని ఎదుర్కోవటానికైనా నిర్మాణాత్మక ఆలోచనలు చేయకపోవటంతో క్రమంగా పౌర సమాజం ఆలోచనల్లో పదునుతగ్గింది. దీర్ఘకాలిక అంశాల ఊసే లేకుండా కేవలం తాత్కాలిక సంక్షేమ పథకాలు, ఆందోళనా స్వేచ్ఛ చుట్టూనే తిరుగుతూ వచ్చింది. 2011లో అన్నా హజారే నేతృత్వంలో జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమం నేపథ్యం నుంచి లోక్‌సత్తా స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ కూడా ఆ మూస ధోరణి వల్లే ఒక పరిధి దాటి మార్పుకి దోహదం చేయలేకపోయారు.

రాజకీయ పార్టీల్లో నిరంకుశ పోకడలు, ప్రభుత్వాలు విమర్శలను సహించలేకపోవటం, డబ్బుతో ప్రచార హోరు వంటి ప్రభావం పెరగటంతో పౌర సమాజంలో నిర్మాణాత్మక ధోరణులు పలచబడటం 2023 ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఏవో కొన్ని సంస్థలు, కొద్దిమంది వ్యక్తులు తప్ప వ్యవస్థీకృత మార్పుకి ఆచరణసాధ్య పరిష్కారాల మీద కృషి కొరవడింది. ఉదాహరణకు కర్ణాటకలో పౌర సమాజం చురుగ్గా ఉంటుంది, పరిణతి, నిర్మాణాత్మక ధోరణులు ఎక్కువ. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలకు ఒక మ్యానిఫెస్టోను రాష్ట్రంలోని స్వచ్ఛంద సంస్థలు 'పౌర సమాజ వేదిక' పేరుతో స్వచ్ఛందంగా రూపొందించాయి. దళితులు, మహిళలు, మురికివాడవాసుల విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం రంగాలలో కృషి చేస్తున్న సంఘాలు, 73, 74 రాజ్యాంగ సవరణలను పూర్తిగా అమలుపరచాలని వికేంద్రీకరణను కోరుతున్న బృందాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. ప్రతి పార్టీ ఈ సమస్యలు, సవాళ్లను మ్యానిఫెస్టోలో ప్రస్తావించాలని అన్ని రాజకీయ పార్టీలనూ వేదిక కోరింది. శాసనసభకు ఎన్నికైన ప్రతి ఒక్కరూ ఆ సమస్యల పరిష్కారానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. కానీ ఆ స్వచ్ఛంద సంస్థల్లో చాలామంది తమ ఎజెండా ప్రాధాన్యతలతో సంబంధం లేకుండా బీజేపీకి వ్యతిరేకంగా, కాంగ్రెస్‌కు అనుకూలంగా పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తే తాము ఎవరి కోసమైతే పోరాడుతున్నామో ఆ పేదలు, అణగారిన వర్గాలకే నష్టం వస్తుందని, ప్రభుత్వం చేయాల్సిన పారిశుద్ధ్యం, మౌలిక వసతులు వంటి పనులకు డబ్బే మిగలదని ఆలోచించకుండా అభివృద్ధితో సమతూకం లేకుండా హామీలిచ్చిన, అన్నిటికంటే ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తూ భవిష్యత్ తరాలపై అసాధ్యమైన భారం వేసే ప్రభుత్వోద్యోగుల పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) మళ్లీ తెస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చారు. ఏనాడూ లేనిరీతిలో కర్ణాటక మొదటిసారిగా ఓవర్‌డ్రాఫ్ట్‌కి వెళ్లటం వల్ల తనకు నిద్ర కూడా పట్టలేదని ఆర్థిక రంగంలో ఎంతో పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వాపోయారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత తెలంగాణలో అదేరీతిలో ఈసారి పలు పౌర సమాజ సంస్థలు బీఆర్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేశాయి.

ఆర్థికంగా తెలంగాణ కంటే బలమైన కర్ణాటకలోనే తాత్కాలిక పథకాల అమలులలో గందరగోళం నెలకొంటే, అక్కడి కంటే తెలంగాణలో భారీ హామీలు, ఓపీఎస్ వంటి ప్రమాదకర హామీ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఈ సంస్థలు మద్దతిచ్చాయి. ఆ సంస్థల నేతలు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. విధానాలపరంగా చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ, విద్య, ఆరోగ్యం మొదలైన అంశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తేడాలేనప్పటికీ ఆర్థికాభివృద్ధి, భవిష్యత్ తరాల ప్రయోజనాల విషయంలో, అభివృద్ధికి, తాత్కాలిక సంక్షేమ పథకాలకు మధ్య సమతూకం విషయంలో బీఆర్ఎస్ మెరుగైనా కూడా ప్రజాస్వామ్యం పేరుతో బీఆర్ఎస్ రాజకీయం తీరుని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. ఆర్థికాభివృద్ధే లేనప్పుడు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటివి కాగితాలకే పరిమితమవుతాయి. ఇదేసమయంలో తెలంగాణలో కొందరు పౌర ప్రముఖులు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ ప్రజా మ్యానిఫెస్టోని విడుదల చేసి పార్టీలకు అప్పీల్ చేశారు తప్ప ఏ పార్టీ వైపు మొగ్గు చూపలేదు.

ఎఫ్‌డీఆర్ ఒరవడి

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఎన్నికలకు ఎంతో ముందునుంచి విధానాల ప్రాతిపదికన ప్రజల్లో అవగాహన పెంచుతూ, అభివృద్ధి, తాత్కాలిక సంక్షేమం మధ్య సమతూకం పాటించాలని తెలంగాణలో రాజకీయ పార్టీలను కోరుతూ వచ్చారు. ఎన్నికల్లో ముఖ్యంగా ఓపీఎస్ హామీ ఇవ్వొద్దని గణాంకాలు సహా పార్టీలకు విజ్ఞప్తి చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ బేఖాతు చేయటంతో ఓపీఎస్ హామీ ఇవ్వకుండా ఆర్థిక సమతూకం పాటిస్తున్న మిగిలిన రెండు ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, బీజేపీల్లో మన ఎన్నికల వ్యవస్థ రీత్యా బీఆర్ఎస్‌కు గెలుపు అవకాశాలు ఎక్కువ ఉండటంతో పరోక్షంగా ఆ పార్టీ పట్ల సానుకూలతను బహిరంగంగా ప్రకటించారు. లోక్‌సత్తా కేవలం ఉద్యమ సంస్థగా

ఉన్నప్పుడు ఎన్నికల సమయంలో పార్టీల అభ్యర్థుల మధ్య చర్చా కార్యక్రమాలు, మేనిఫెస్టోలో చేర్చాల్సిన విధానపరమైన అంశాలను ప్రతిపాదించటం, ఆ అంశాల చుట్టూ ప్రజల్ని సమీకరించటం చేసినా, ఒక పార్టీ వైపు జేపీ పరోక్షంగానైనా మొగ్గుచూపటం ఇదే మొదటిసారి. ఎందుకంటే, దేశానికి ఆర్థికరంగంలో ఇప్పుడు చాలా గొప్ప అవకాశం అందుబాటులో ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా సంక్షేమమే పరిపాలన, అప్పులు చేసైనా తాత్కాలిక పథకాలు, ఓపీఎస్ వంటి హామీలు ఇస్తుంటే మాత్రం వినాశకర పరిణామాలు వస్తాయి. 2047 నాటికి భారతదేశం అగ్ర దేశాల స్థాయికి రావాలంటే ఈవేళ ఆర్థికాభివృద్ధిని పరిరక్షించటం అత్యంత కీలకం. ఓట్ల కొనుగోలు, కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగాల చుట్టూ ఓటు కంటే కూడా కీలకం. ఎన్నికల సంస్కరణలు, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన మొదలైన కీలకాంశాల కోసం కృషి కొనసాగిస్తూ సమయం వచ్చినప్పుడు ఒడుపుగా పోరాడి సాధించుకుందాం, కానీ ముందు ఆర్థికాభివృద్ధి ఉంటే గదా మిగిలిన సంస్కరణల గురించి మాట్లాడటానికి అని వాదిస్తూ జేపీ గట్టి పోరాటం చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో ఇంటర్వ్యూ సుమారు రెండు గంటలున్నా, చాలా వరకు కట్ చేసి బీఆర్ఎస్ విధానాలకు అనుకూలంగా ఉన్నట్లున్న ఫుటేజ్‌తో వీడియోను విడుదల చేయటం వల్ల విమర్శలను ఎదుర్కొన్నా, ఎన్నికలకు ముందు సర్వేల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నాయని ప్రస్ఫుటంగా కనిపిస్తున్నా అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం అనే విధానానికి జేపీ కట్టుబడి వ్యవహరించారు. అధికారాన్ని ఆరాధిస్తూ పార్టీల వారీగా చీలిపోయే, పౌర సమాజాన్ని తక్కువగా చూసే మన సమాజంలో ఏ పార్టీ విధానాల్ని విమర్శించినా బురద జల్లుతుంటారు. అయినా జంకకుండా జేపీ తన నిర్మాణాత్మక ప్రచారాన్ని కొనసాగించారు. క్రమంగా పలువురు అర్థం చేసుకున్నారు. హైదరాబాద్, పలు పట్టణ ప్రాంతాల్లో జేపీ అభివృద్ధి వాదనకు మంచి స్పందన కనిపించింది. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అత్యధిక సీట్లలో గెలవటానికి, కాంగ్రెస్ మూడో స్థానంలో నిలవటానికి ఆర్థికాభివృద్ధి అంశం కీలకంగా నిలిచింది. వికేంద్రీకరణ లేకుండా అభివృద్ధి ఫలాలు హైదరాబాద్‌కే పరిమితం కావటం వల్ల నీళ్లిచ్చినా గ్రామీణ తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమికి పెద్ద కారణమైంది. ఏ పార్టీకీ, ఏ నేతకూ మొగ్గు చూపకుండా, విధానాల ప్రాతిపదికన ఎన్నికల ప్రచార సమయంలో జేపీ నేతృత్వంలో ఎఫ్‌డీఆర్ చేసిన కృషి పౌర సమాజ పాత్రను కొత్త స్థాయికి తీసుకెళ్లింది.

*అధికారాన్ని ఆరాధిస్తూ పార్టీల వారీగా చీలిపోయే, పౌర సమాజాన్ని తక్కువగా చూసే మన సమాజంలో ఏ పార్టీ విధానాల్ని విమర్శించినా బురద జల్లుతుంటారు. అయినా జంకకుండా జేపీ తన నిర్మాణాత్మక ప్రచారాన్ని కొనసాగించారు.క్రమంగా పలువురు అర్థం చేసుకున్నారు. హైదరా బాద్, పలు పట్టణ ప్రాంతాల్లో జేపీ అభివృద్ధి వాదనకు మంచి స్పందన కనిపించింది.*

ప్రజల రోజువారీ అవసరాలను తీర్చటంలో మన స్వచ్ఛంద సంస్థలు ప్రశంసనీయ కృషి చేస్తున్నాయి, అదే విధంగా ప్రభుత్వం చేయాల్సిన విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో కూడా గొప్ప ప్రయత్నం చేస్తున్నాయి, కానీ పౌర సమాజంగా రాజకీయ పార్టీలకు దిశానిర్దేశం చేయటం, ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయటం విషయంలో మాత్రం నిర్మాణాత్మక పాత్రను పోషించలేకపోతున్నాయి. ఆ లోపాన్ని సరిదిద్దే క్రమంలో ప్రస్తుత తెలంగాణ ఎన్నికల్లో ఎఫ్‌డీఆర్ ఒక మార్గం చూపింది.

అదేవిధంగా ప్రభుత్వోద్యోగుల అసంబద్ధ డిమాండ్‌కు వ్యతిరేకంగా ఒక పౌర సమాజ సంస్థ పనిచేయటం బహుశా భారతదేశ చరిత్రలో ఇదే ప్రథమం. ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సంస్కరించటమనే సాహసం చేయగలిగిన రోజు భారతదేశంలో పెద్దమార్పు వస్తుందని రాజకీయ దార్శనికుడు, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల్ని ప్రతిపాదించిన శరద్ జోషి తరచూ అనేవారు. ఓపీఎస్‌కు వ్యతిరేకంగా పూర్తి గణాంకాలతో ఎఫ్‌డీఆర్ ఈ పోరాటం చేసింది. ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయటం వల్ల దేశం ఆర్థికంగా నాశనమవటమేకాకుండా చివరికి ప్రభుత్వోద్యోగులకు కూడా పెన్షన్ రాదని, ఆ స్థానంలో 2004 నుంచి అమలు చేస్తున్న కొత్త జాతీయ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్)ను కొనసాగించటం వల్ల దేశం ఆర్థికంగా ఎదిగి ఉపాధి అవకాశాలను అందించగలుగుతుందని, ఉద్యోగులకు గ్యారంటీ పెన్షన్ లభిస్తుందని గణాంకాలతో సహా జేపీ చేసిన వాదనకు ప్రభుత్వోద్యోగుల్లో కూడా పలువురు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వాలు, ప్రభుత్వోద్యోగులు ప్రజల కోసం తప్ప, ప్రభుత్వాలు, ఉద్యోగుల కోసం ప్రజలు ఉండరని, ప్రభుత్వోద్యోగుల డిమాండ్లయినా అసంబద్ధమైనప్పుడు తిరస్కరించాలని, సంఘటితంగా ఉన్నంత మాత్రాన, గొంతున్నంత మాత్రాన ప్రజలకు వ్యతిరేక డిమాండ్‌లు చేస్తే ప్రభుత్వోద్యోగులైనా ప్రశ్నించాల్సిందేనని, ఎవరూ అతీతం కాదని ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఒక ఒరవడి ఏర్పడింది.

అదేవిధంగా, ఎన్నికలు ఫలితాలు వెలువడి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక, హామీల అమలుపై ముందే మేలుకోవాలని, నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఏవేవి ఎంతమేర ఆచరణసాధ్యమో నిజాయతీగా ప్రజల ముందు పెట్టి ఆ మేరకు అమలు చేయాలని, బీఆర్ఎస్ ఓడిపోయామనే కసితో వ్యవహరించకుండా పరిపాలన సజావుగా నడిచేలా కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారం అందించాలని జేపీ

సూచించారు. కర్ణాటకలోనూ ఓపీఎస్ అమలు చేయకుండా ఏపీ తరహాలో జీపీఎస్ వంటి మధ్యేమార్గం అనుసరించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి పౌర సమాజ సంస్థలకు ఎన్నికల సమయం ఒక మంచి అవకాశం. ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో అది గొప్ప అవకాశం. తెలుగు రాష్ట్రాలు వేదికగా భారతదేశంలో మౌలిక రాజకీయ, పాలనా సంస్కరణల్ని ప్రతిపాదించి కొత్త రాజకీయానికి ఒరవడి దిద్ది ఒక్క ఎంపీ కూడా లేకుండా మూడు రాజ్యాంగ సవరణల్ని, ఏడెనిమిది చట్టాల్ని, పలు విధానపరమైన మార్పుల్ని సాధించి గత యాభై అరవై ఏళ్లలో ప్రపంచంలో ఏ పౌర సమాజ సంస్థా సాధించని మార్పుల్ని సాధించిన థింక్‌ట్యాంక్ ఎఫ్‌డీఆర్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన కృషి ప్రజాస్వామ్యం వేళ్లూనుకునేందుకు, బహుముఖంగా విస్తరించేందుకు దోహదం చేస్తుంది. పార్టీలు, వ్యక్తుల చుట్టూ కాకుండా ఎఫ్‌డీఆర్ తరహాలో విధానాల ప్రాతిపదికన పరిష్కారాలతో కృషి చేయటం వల్ల ప్రజలకు నిజమైన అభివృద్ధి, దీర్ఘకాలిక లబ్ధి చేకూరతాయి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఫేక్ కార్యక్రమాలు, ప్రజాప్రయోజనాలకు హానికరమైన ఎజెండాతో పనిచేసే స్వచ్ఛంద సంస్థల్ని నియంత్రించాలి తప్ప, అన్ని సంస్థల్నీ ఒకే గాటన కట్టి అణగదొక్కకుండా ఆరోగ్యకరమైన రీతిలో వ్యవహరించాలి, పరిష్కారాలతో ప్రశ్నించే పౌర సమాజ కృషిని ప్రోత్సహించాలి. పరిష్కారాలు, విధానాలపై యూనివర్సిటీలలో నాణ్యమైన పరిశోధనకు తగిన వనరుల్ని అందించే సంస్కృతిని పెంపొందించాలి. సమాజం, ముఖ్యంగా యువత స్థానిక స్థాయి నుంచి పౌర సమాజ కార్యక్రమాల్లో భాగస్వాములై తమ జీవితాల్లో హీరోలుగా, ప్రజాజీవితంలో నాయకులుగా ఎదగాలి. స్థానికంగా, అదేవిధంగా సామాజిక అంశాల మీద కూడా స్వచ్ఛంద కృషి జరుగుతున్నప్పుడు పౌర సమాజ సంస్థలు విధానపరమైన మార్పుల్ని వేగంగా సాధించగలుగుతాయి.

మరికొన్ని నెలల్లో లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఓపీఎస్ మళ్లీ ఎన్నికల ఎజెండా కాకుండా చూసేందుకు, పార్టీల హామీలు, ప్రభుత్వాల బడ్జెట్ ప్రతిపాదనల్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించి వాస్తవ గణాంకాలను ప్రజల ముందుంచే చట్టబద్ధ స్వతంత్ర సంస్థ ఏర్పాటుకు, దేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకి రాజ్యాంగంలోని 293 అధికరణం ద్వారా చర్యలు తీసుకునేందుకు, జీతాలు, తాత్కాలిక పథకాలు, పెన్షన్లు వంటి రోజువారీ ఖర్చు ఈవేళ్టి ఆదాయం నుంచి తప్ప అప్పులు చేసి చేయకుండా, అప్పు తెచ్చిన డబ్బు భవిష్యత్ పెట్టుబడులకు మాత్రమే ఉపయోగించేలా ఎఫ్ఆర్‌బీఎం తరహాలో చట్టబద్ధ ఏర్పాట్లకు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వేదికగా జేపీ కృషి చేస్తున్నారు.

✳

> ***ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఫేక్ కార్యక్రమాలు, ప్రజాప్రయోజనాలకు హానికరమైన ఎజెండాతో పనిచేసే స్వచ్ఛంద సంస్థల్ని నియంత్రించాలి తప్ప, అన్ని సంస్థల్నీ ఒకే గాటన కట్టి అణగదొక్కకుండా ఆరోగ్యకరమైన రీతిలో వ్యవహరించాలి, పరిష్కారాలతో ప్రశ్నించే పౌర సమాజ కృషిని ప్రోత్సహించాలి.***



## చట్టబద్ధ పాలన అందించాలి

**కొత్తప్రభుత్వం జవాబుదారీతనం, చట్టబద్ధమైన పాలన అందించాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకుడు పందిళ్ల శంకర్ కోరారు. అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లిరెడ్డి మోహన్‌రెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సీపీఐ మండల కార్యదర్శి మల్లేశ్, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, పద్మావతి,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజమల్లయ్య, శ్రీనివాస్, వీరసోమయ్య, చంద్రారెడ్డి, సాంబమూర్తి, అశోక్, సంజీవరెడ్డి,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.**

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

**ప్రతీ సంవత్సరం జనవరి 25వ తేదీని స్వయం పాలన(Self-governance)కోరుకునే ఓటర్లందరూ "భారత జాతీయ జుగాడ్" ఓటర్ల దినోత్సవంగా వ్యవహరించడం ఉద్యమ స్ఫూర్తికి సముచితంగా ఉంటుందని భావిద్దాం!**

**జుగాడ్ ఓటర్లుగా మన భవిష్యత్తు మనమే నిర్మించుకుందాం !**

**ఈ అవకాశం మళ్ళీ మళ్ళీ రాకపోవచ్చు ..**

జుగాడ్ ఓటర్ల భాగస్వామ్యంతో ఆచరణయోగ్యమైన (Implementable) ప్రజాస్వామ్యం. అంతర్గత ప్రజాస్వామ్యంతో మరియూ, నమూనా మార్పుతో ప్రతిపాదిత ద్విపక్ష జాతీయ పార్టీ ని ఇదే FDR Loksatta ఉద్యమ సంస్థ జనబలం ఆగస్టు 2023 ద్వారా ఓటర్లజాతికి అంకితం చేయడం జరిగింది! ఆలోచించే మనసున్న స్త్రీపురుషులందరికీ ఇదొక రాజ్యాంగబద్ధ ఆర్థిక సామాజిక శాంతియుత అధికార మార్పిడికి స్వల్ప ఖర్చుతో సాధ్యమయ్యే - పారదర్శక సూక్ష్మ మార్గం !

ఓటరు యొక్క వార్షికాదాయం 3 లక్షల లోపుంటే 2 వేలు, లేదా 5 లక్షల లోపుంటే 5 వేలు, లేదా 10 లక్షల లోపుంటే 10 వేల రూపాయిలు ఒకేఒక్కసారి బేషరతుగా ఇవ్వగలిగిన వారందరూ జుగాడ్ ఓటర్లే. రైతన్నలూ, లాయర్లూ, ప్రభుత్వోద్యోగులూ, మీడియామిత్రులతో సహా ఇవ్వగలిగిన వారు అందరూ ఎంతోకొంత డబ్బు SBI బాండ్ల రూపేణా విరాళమివ్వాలి. నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం అనే మూల సూత్రం పై పొలిటికల్ పార్టీలన్నీ పనిచేయాలనీ 75% మెజార్టీతో పరిపాలన సాగాలనీ తలపెట్టిన ఈ ఉద్యమాన్ని విజయపథంలో నడిపించవలసిన బాధ్యత జుగాడ్ ఓటర్లదే!

**మన డబ్బు - మన ఓటు - మనఎజెండా-మనపార్టీ-మన సమిష్టి అధికారం**

MLAలయినా MPలయినా అత్యధిక ఓటర్లకు ఉపయోగపడే విధంగా చట్టాలను చేయాలి. కానీ ప్రస్తుత వ్యవస్థలో కొందరి ప్రభుత్వోద్యోగుల సహకారంతో సామాన్య ఓటర్లకు కోర్టుల చుట్టూ జీవితాంతం తిరిగినా సమాన న్యాయం జరగని దుస్థితి.

మన రాజ్యాంగం ప్రాథమిక హక్కు ద్వారా (Fundamental Right) మనకు కల్పించిన అధికారాన్ని నేటి పేద, మధ్యతరగతి ఓటర్లు విస్మరించి, మిగతా విషయాలలో (అనగా, రాజకీయంలోకి తీసుకురావలసిన అవసరం లేని కులం, మతం, మద్యం, ప్రాంతం, భాష, యాస) మొదలైన అంశాలలో మనము అభిమానించే కొంతమంది ప్రజాప్రతినిధుల ఉపదేశాలకు సమ్మోహితులమైపోయి మనకు న్యాయం జరగలేదంటూ మనని మనమే మోసం చేసుకుంటున్నాం. మంచి పార్టీ స్థాపించాలన్నా మంచి ప్రభుత్వాన్ని ఏర్పరచాలన్నా మొట్టమొదట అత్యంత విలువైన మన ఓటు హక్కు ని మనం కాపాడుకోవాలి. ఈలోగా, మన జాతీయ ఎన్నికల కమిషన్ అప్పుడప్పుడు ఏదో వంకతో సవరిస్తూ పోయే ఓటర్లలిస్టులో, స్త్రీయైనా, పురుషుడైనా, మీపేరు తొలగించకుండా ఉండేలా చూసుకుంటూ జాగ్రత్తపడాలి.

with best wishess for a Happy New Year **2024**

Please contact M.Parthasarathy **(9866416798)**

Advt

# లక్ష్యాన్ని వీడలేదు..మార్గం మారలేదు

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆకెళ్ల రాఘవేంద్ర ముఖాముఖి (చివరి భాగం)




**ప్రశ్న:** రాజకీయ పార్టీలు కానీ ప్రభుత్వాలు కానీ.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తాత్కాలికమైన అంశాల మీద తప్ప మౌలిక సంస్కరణల అమలుకు పూనుకోవడం లేదు. ఎన్నికలకు ఎన్నికలకు మధ్యలో ప్రభుత్వాల్లో కదలిక తీసుకు రావాలంటే ఏం చేయాలి?

**జేపీ:** సందర్భాన్ని బట్టి ఒడుపుగా మన కార్యాచరణ ఉండాలి. అంతే తప్ప నా పుర్రెలో పుట్టిన బుద్ధిని బట్టీ వ్యవహరిస్తానంటే సరికాదు. సందర్భోచితంగా ఉండాలి. ప్రతిదానికి సిద్ధంగా ఉండాలి. లోక్‌సత్తా ఏ అంశం వచ్చినా కానీ సన్నద్ధంగా ఉంది. ఆనాడు రాజకీయ మార్పుకు సిద్ధంగా ఉంటే గట్టిగా ప్రయత్నం చేశాం. ఈనాడు దానికి పెద్దగా ఆసక్తి లేకపోతే మిగతా మార్పుల కోసం ప్రయత్నం చేద్దాం. విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలనలో కనీసం కొన్ని ఏర్పాట్లు చేయడం, పట్టణ ప్రాంతాల్లో పన్నులు కట్టే వాళ్లని వార్డు కమిటీలు వాటి ద్వారా సమీకరించి స్థానిక ప్రభుత్వం ఒకస్థాయిలో అయినా ఏర్పాటు చేయడం, వ్యవసాయరంగంలో రిటైల్ చైన్స్‌లాంటివి పెంచి రైతుల ఆదాయం పెరిగేలా చేయడం..ఇవాళ చేపల ఉత్పత్తి, ఎగుమతుల ద్వారా ఎలా సంపాదిస్తున్నామో అలా అన్ని రంగాల్లో కూడా ఆదాయం బాగా పెరిగేలా వ్యవసాయంలో మార్పులు తేవడం.. ఇలా కొన్ని నిర్దిష్టమైన అంశాలు ఉన్నాయి. కాబట్టి మనకు మనసు ఉండాలే కానీ మార్గాలు అనేకం ఉన్నాయి. లక్ష్యం మారలేదు..దిశ మారలేదు..వాహనం మారుతూ ఉంటుంది. మారాలి..రాజకీయం చెడు అని ఏనాడు నా నోటి నుంచి రాలేదు. రాజకీయం పవిత్ర వ్యాసంగం అని వేలసార్లు నేను ఉద్ఘాటించాను. ఆ పదజాలాన్ని వాడిన వాడ్నే నేను. కాబట్టి రాజకీయంగా ప్రజల్ని సమీకరిస్తే వేగంగా మార్పులు వస్తాయని ఒక అంచనాకి వచ్చాం. మనం ఉన్న రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో ఆచరణలో ఇది సాధ్యం కాదని తేలింది. కాబట్టి కారణం బహిరంగంగా చెప్పేసి పక్కకి వెళ్లాను అంతే. ఇవాళ కూడా ఆ అవకాశం ఉంటే..అంటే డబ్బులు పంచకుండా...తాయిలాలు ఇవ్వకుండా 15-20 శాతం ఓట్లు వచ్చే పరిస్థితి ఉంటే కచ్చితంగా రాజకీయప్రక్రియను ఉపయోగించుకోవచ్చు. నా దృష్టిలో మనం ఉన్న ప్రాంతాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా దక్షిణాదిలో ఆ పరిస్థితి లేదు. ఈ వాహనం పనికి రాదు అంటే మరో వాహనానికి వెళతాం తప్ప మార్గం మారదు..లక్ష్యం మారదు. నేను ఒక అధికారిగా ప్రభుత్వంలో ఉన్నా..రాజకీయ పార్టీ అయినా..ఉద్యమ నేతగా ఉన్నా.. స్వచ్ఛంద సంస్థ నడుపుతున్నా కూడా నా భాష, నా తీరు ఏం మారలేదు. ఆలోచన మారలేదు. నాకు తెలియకుండా చూపరులకు మార్పు కనిపిస్తే చర్చించుకోవచ్చు.

**ప్రశ్న:** లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ సాధించిన విజయాల గురించి ఏం చెబుతారు?

**జేపీ:** అన్నీ ఏకరువు పెట్టనక్కర్లేదు కానీ..మొట్టమొదట సాధించిన విజయం ప్రభుత్వంతో కూడా సంబంధం లేదు.

వినియోగదారుల చేతుల్లో, ప్రజల చేతుల్లో మంచి ఆయుధాన్ని పెట్టి పెద్ద మార్పును చాలా సునాయాసంగా సాధించాం. కొండను తవ్వి ఎలుకను పడితే ఉపయోగం లేదు. చిన్న ప్రయత్నంతో పెద్ద ఫలితాన్ని సాధించగలగాలి. ఆ రోజుల్లో పెట్రోలు బంకుల్లో 10శాతం పెట్రోలు మీటర్లలో మోసం ఉండేది. నూటికి 90శాతం బంకుల్లో ఈ విధంగా జరిగేది. ఈ దేశంలో మనం తలుచుకుంటే మార్పులు అసాధ్యం కాదని చెప్పడానికి ఇదో మంచి ఉదాహరణ. తూనికలు, కొలతల శాఖ అధికారులు సర్టిఫై చేసిన లీటరు, ఐదు లీటర్ల క్యాన్లు తీసుకుని 1998 అక్టోబర్ 2వ తేదీన పెట్రోలు బంకులకు వెళ్లి అందులో పెట్రోలు పోయాలని అడిగాం. ఇది ఎప్పుడైతే మొదలైందో పదిహేను రోజుల్లో బంకులన్నింటిలో మీటర్లు సరిచేశారు. అప్పుడు ఎక్కువగా రాజకీయ నేతలు..వారి బంధువులకే బంకులు ఉండేవి. జనంలో చైతన్యం రాగానే దేశం మొత్తం బంకులను మార్చేశారు. అయితే ఇప్పుడూ మోసం ఉంది. అప్పుడు 10 శాతం ఉంటే ఇప్పుడు 1.5 శాతం ఉంది. 85శాతం విజయం సాధించాం. ఏటా లక్షల కోట్ల రూపాయలు ఈ దేశంలో వినియోగదారులు నష్టపోకుండా ఆపగలిగాం. దాంతో ఉద్యమాన్ని ప్రారంభించాం. నేరచరితుల వివరాలు బయటపెట్టాం.. ఓటర్ల జాబితాలో ప్రక్షాళన, 2003లో రాజకీయ పార్టీలు నిజాయితీగా విరాళాలు సేకరించేలా చట్టం తీసుకువచ్చేందుకు కృషి, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం. సహకార సంఘాల స్వయం ప్రతిపత్తి కోసం రాజ్యాంగ సవరణ, జాతీయ ఆరోగ్య మిషన్, స్థానిక న్యాయాలయాల చట్టం సాధించాం. వ్యవసాయం రంగంలో ఆంక్షలు తొలగింపచేసి ఎక్కడ రేటు ఉంటే అక్కడ అమ్ముకునేలా చేయడం, ఎగుమతుల నిషేధాన్ని తొలగించడం..లోక్‌సత్తా పోరాటం వల్ల బియ్యం ఎగుమతుల నిషేధం పోయింది. ఇవాళ ప్రపంచంలో భారతదేశం నెంబర్ 1 ఎగుమతిదారు. ప్రతీ సంవత్సరం కోటి టన్నులు ఎగుమతి చేస్తున్నాం. ఆనాడు లోక్‌సత్తా చేసిన పోరాటం వల్లే అది సాధ్యం అయింది. రాష్ట్రాల మధ్య అమ్మడానికి లేకుండా రేట్లు తగ్గించేస్తుంటే పాదయాత్రలు చేసి ప్రజల్ని ఒక ఉద్యమంగా తయారు చేసి ఆంక్షల్ని తొలగించే ఏర్పాటు చేసింది..లోక్‌సత్తా. ఇవాళ దేశం అంతా అది అమలులో ఉంది. 2జీ స్పెక్ట్రమ్ లైసెన్స్‌లు రద్దు చేసి, కార్పొరేటివ్ బిడ్డింగ్ అమలు చేయడం లోక్‌సత్తా చేసిన పోరాటం ఫలితంగానే జరుగుతోంది. మనం చేసిన పోరాటం ఫలితంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇలా అసంఖ్యాకంగా ఉన్నాయి. కానీ నాకు తృప్తి లేదు. ప్రజలు తలుచుకుంటే, విజ్ఞతతో కనుక మనం పోరాడితే ఫలితాలు వస్తాయి..ఆ విశ్వాసం తప్ప జరగాల్సిన దాంతో పోలిస్తే ఇంకా జరిగింది తక్కువ. అలాగే జాతీయ ఆరోగ్య విధానంలో కీలక పాత్ర వహిస్తున్నాం. విద్యా రంగంలో కీలక పాత్ర వహించాం. విద్య బాగుపడేంత వరకు నాకు పరిష్కారం వచ్చినట్టు కాదు. ఫలితాలు వస్తాయి. దీనిలో పదో వంతు సాధించినవాళ్లు..అది చాలనుకుంటే జీవితం అంతా బాగుందనుకుంటారు. నాకు ఆ అదృష్టం లేదు. అది చాలదని స్పష్టంగా అవగాహన ఉన్నవాడ్ని. అది సాధించిన రోజు కూడా నేను ఉప్పొంగిపోలేదు. అందరూ నన్ను అడుగుతుంటారు..కోప్పడుతుంటారు. ఇంత కష్టపడ్డాం.. విజయం వస్తే ఆ రోజున్నా సంతోషపడరేంటంటే..సంతోషమే కానీ జరగాల్సింది చాలా ఉంది..అంత విజయోత్సాహం వద్దని చెబుతాను.

**లోక్‌సత్తా పోరాటం వల్ల బియ్యం ఎగుమతుల నిషేధం పోయింది. ప్రపంచంలో భారతదేశం నెంబర్ 1 ఎగుమతిదారు. ప్రతీ సంవత్సరం కోటి టన్నులు ఎగుమతి చేస్తున్నాం. ఆనాడు లోక్‌సత్తా చేసిన పోరాటం వల్లే అది సాధ్యం అయింది. రాష్ట్రాల మధ్య అమ్మడానికి లేకుండా రేట్లు తగ్గించేస్తుంటే పాదయాత్రలు చేసి ప్రజల్ని ఒక ఉద్యమంగా తయారు చేసి ఆంక్షల్ని తొలగించే ఏర్పాటు చేసింది..లోక్‌సత్తా.**

**ప్రశ్న : రాబోయే రోజుల్లో మీ ముందున్న రోడ్‌మ్యాప్ ఏంటి?**

**జేపీ:** మనం రాజకీయం, ప్రజాస్వామ్యంలో సాధించాల్సింది చాలా ఉన్నా కూడా..మనదేశంలో కొంతమేరకైనా మారిన పరిస్థితుల ప్రభావం ఓ పక్క, రెండు.. ప్రపంచంలో మారుతున్న పరిస్థితులు..మనకు అనుకూలంగా వస్తున్న పరిస్థితుల ప్రభావం మరికొంత..ఈ రెండు కారణాలుగా వచ్చే 25 ఏళ్లలో ఒక అద్భుతమైన ఆర్థిక ప్రగతికి ఒక పునాది ఏర్పడింది. 7-8శాతం తగ్గకుండా ప్రతీ సంవత్సరం ఆర్థిక ప్రగతి రేటు ఈ దేశానికి మొట్టమొదటిసారిగా సాధ్యం. ఇప్పుడు అది సాధించుకోకుండా పూర్తిగా మనం మూర్ఖమైపోయి పోగొట్టుకోవడం తప్పు. కాబట్టి మనం ఇప్పుడు ఈ ఆర్థిక ప్రగతికి అడ్డంకులు లేకుండా చేయాలి. సంపద పెరిగితే.. ఆదాయాలు పెరిగితే.. ఉపాధి వస్తే అది కదా మనం చూడాల్సింది... జీవితాలు సుఖవంతం కావాలని కదా..మనం అద్భుతమైన రాజ్యాంగాన్ని రాసుకుని, గొప్ప ఎన్నికలు జరుపుకుని మంచి వాళ్లని అక్కడ పెట్టుకుని పని జరక్కుండా ఉంటే ఉపయోగం ఏం ఉంది. పని జరగడం అంటే మనుషుల జీవితాలు బాగుపడడం. కాబట్టి గొప్ప అవకాశం ఉంది. దానికి అడ్డంకులను తొలగించాలి. ప్రధానంగా మూడు అడ్డంకులు ఉన్నాయి. మొట్టమొదటి అడ్డంకి..ప్రభుత్వాలు తాము చేయాల్సిన పనులు చేయకుండా తాయిలాలు మాత్రం ఇచ్చేసి ఆర్థిక వ్యవస్థ పెరగకుండా అడ్డుపడుతున్నారు. మౌలిక సదుపాయాలు లేకుండా... నైపుణ్యాలను పెంచకుండా.. ఉత్పాదకతను పెంచకుండా పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సాహకర వాతావరణం కల్పించకుండా, ఉపాధి కల్పించే వాతావరణం కల్పించకుండా.. ఆర్థిక ప్రగతి అనుకున్నంత జరగదు. ప్రభుత్వాలు నోర్మూసుకు కూర్చున్నా..ఏం చేయకపోయినా కొంత




జరుగుతుంది.. ప్రభుత్వాలు ఏం చేయక్కర్లేదు. మారుతున్న టెక్నాలజీ, మన తపన వల్ల..కొంతమేర అభివృద్ధి జరుగుతుంది. అయితే అది మరింత వేగవంతం కావాలంటే అడ్డంకులు తొలగించాలి. ఇది మొట్టమొదటిది. ఉదాహరణకు ఇటీవల కాలంలో శ్రీలంకను చూసిన తర్వాత మనదేశంలోని కొన్ని రాష్ట్రాలు కూడా ఉదాహరణకు.. పంజాబ్, రాజస్థాన్, బెంగాల్, ఆంధ్రప్రదేశ్ కొంత మేర రాష్ట్ర విభజన నేపథ్యంలో కానీ, తాయిలాల వల్ల కానీ, తెలంగాణ అవసరం లేకున్నా కూడా కొని తెచ్చుకున్న ఇబ్బందుల వల్ల కానీ ఏమవుతోంది..క్రమ క్రమంగా అప్పుల ఊబిలో కూరుకుపోవడం, ప్రభుత్వం చేయాల్సిన పనుల్లో వైఫల్యం కొంత కనిపిస్తోంది. ఇప్పుడు గాడిన పెట్టాలి. ఇప్పటికి తీవ్రమైన ఆలస్యం ఏం కాలేదు. కొంత ఆలస్యమైనా కూడా ఇప్పుడు సరిచేస్తే మనం మార్గాన్ని చూపెట్టగలం. దానికి రాజ్యాంగంలో ఏర్పాట్లు ఉన్నాయి. దానికోసం బాగా గొంతు విప్పుతున్న వాళ్లలో నేను ఒకడిని. చాలాకాలం నేను మాట్లాడుతున్నా కూడా పట్టించుకోలేదు. కానీ ఈ మధ్య కాలంలో కాస్త పట్టించుకోవడం మొదలు పెట్టారు. సుప్రీంకోర్టు కూడా ఈ మధ్య మాట్లాడుతోంది. కాబట్టి అదో కీలకమైన అంశం. **రెండోది:** విద్య, ఆరోగ్యం. సామాన్య ప్రజల జీవన స్థితిగతులు బాగుపడాలంటే సులభమైన పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో అత్యున్నత ప్రమాణాల విద్య, ఆరోగ్యం ప్రతి ఒక్కరికి అందడం. అది గ్యారంటీగా సాధ్యం. **మూడోది:** చట్టబద్ధ పాలన. అంటే పోలీసు యంత్రాంగం, ప్రాసిక్యూషన్, కోర్టుల్లో సకాలంలో ప్రజలకు న్యాయం సమర్థంగా అందడం..అందర్నీ సమానంగా చూసే వ్యవస్థ రావడం. అన్నీ కాకపోయినా ఒకొక్కటీ చేద్దాం. దానిలో చాలా అంశాలు మిళితమై ఉన్నాయి. **నాలుగోది:** అధికార వికేంద్రీకరణ. ప్రధానంగా కనీసం పట్టణ ప్రాంతాల్లో పన్నులు కడుతున్నామనే స్పృహ ఉంది కాబట్టి..దాని చుట్టూ ప్రజలను ప్రేరేపితం చేసి..ఎందుకంటే ప్రజలకి స్థానిక ప్రభుత్వాలు అవసరం అన్న భావన కలగకపోతే మీరు..నేను గాంధేయ సిద్ధాంతాలు ఎన్ని చెప్పినా కూడా దానికి సిద్ధపడరు. కాబట్టి ప్రజల జీవితానికీ, కట్టే పన్నులకీ మధ్య సంబంధాన్ని తీసుకురావాలి. గ్రామ ప్రాంతాలకు వేరే మార్గం ఉండాలి. వేరే వ్యూహం కావాలి. చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి దూర ప్రాంతాలకు ఎక్కువ మంది వలసపోయే అవసరం లేకుండా వ్యవసాయానికి పట్టణాలకి మధ్య అనుసంధాన్ని పెంచినట్టయితే ఉన్న ఊరిలో పొలం చూసుకుంటూనో లేదా వ్యాపారమో, వృత్తో చూసుకుంటుంటే అది చాలా ఆరోగ్యకరమైన అభివృద్ధి అవుతుంది. కాబట్టి నూతనకరమైన పట్టణీకరణకు ఏర్పాట్లు చేయడం. ఇక సమయం సందర్భాన్ని బట్టి రాజకీయ పార్టీలు అలసిపోయిన నాడు అప్పుడు ఎన్నికల వ్యవస్థలో మార్పులు. రాజకీయ పార్టీలు వ్యక్తుల ఆస్తులు అయిపోయినాయి.. రాజకీయపార్టీలు నిజంగా ప్రజల వేదికలుగా ప్రజాస్వామికీకరణ చేయడం. ఇవీ లక్ష్యాలు. ఏది ముందు ఏది వెనుక అనేది సందర్భాన్ని బట్టి..అవకాశాన్ని బట్టి.


**ఆకెళ్ల:** *దారంతా గోతులు..చుట్టూతా చీకటి..ఇల్లేమో దూరం..కానీ ధైర్యమే ఒక కవచం అంటారు..అమృతం కురిసిన రాత్రిలో రచయిత దేవరకొండ బాలగంగాధర్ తిలక్. కాబట్టి లోక్‌సత్తా ప్రస్థానాన్ని గత 25 ఏళ్లుగా చూసినా..రాబోయే మరో 25..50 ఏళ్లు చూసినా చుట్టూరా చీకటి ఉందని తిట్టుకోవడం కాకుండా ప్రయత్నించి ఒక చిన్న దీపాన్ని వెలిగించడం, ధైర్యాన్ని కవచంగా తీసుకుంటూ, జ్ఞానాన్ని ఆయుధంగా తీసుకుంటూ ముందుకు వెళ్లడమే ఇవాళ మధ్యతరగతి అయినా, మానవాళి అయినా భారతీయ సగటు ఓటరు అయినా అసలు సిసలు పౌరుడైనా చేయాల్సింది..అలా చేయడమే..చేయించే విధంగా భావ విప్లవాన్ని తీసుకురావడమే ఆధునిక భారతదేశ రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో లోక్‌సత్తా ప్రయత్నం..ప్రభావం..ప్రస్థానం.*

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021** (తెలుగులో స్థూల అనువాదం)

**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**



అనుబంధం 5.1: విభజనకు ముందు పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ కార్యక్రమం

ఆరోగ్యశ్రీ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) ప్రభుత్వం చొరవతో 2007లో ప్రారంభమైన ఎంతో ప్రాధాన్యయుత కమ్యూనిటీ ఆరోగ్య బీమా పథకం. "అందరికీ ఆరోగ్యం" లక్ష్యంగా పేదలకు సార్వత్రిక ఆరోగ్య కవరేజీని వెనుకబడిన మూడు జిల్లాలు మహబూబ్‌నగర్, అనంతపురం, శ్రీకాకుళంలలో పైలట్ ప్రాతిపదికన అందిస్తూ కమ్యూనిటీ ఆరోగ్య బీమాగా ఆరోగ్యశ్రీ మొదలైంది.

ఆ తర్వాత, కార్యక్రమాన్ని జులై 17, 2008 నుండి మొత్తం ఆంధ్రప్రదేశ్‌కి దశలవారీగా విస్తరించి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బి.పి.ఎల్) 1.92 కోట్ల కుటుంబాలకు వర్తింప చేశారు. పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించాక ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూడా ఇది విజయవంతంగా నడుస్తోంది.

ఆరోగ్య బీమాలో విలక్షణ పి.పి.పి నమూనాతో కొన్ని గుర్తించిన వ్యాధులలో ఆస్పత్రి సేవలు, శస్త్ర చికిత్సలు, చికిత్సలలో నాణ్యమైన సేవలను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు అందుబాటులోకి తేవటం ద్వారా ఈ కార్యక్రమం సామాజిక భద్రతను అందిస్తోంది. గుర్తించిన ప్రభుత్వ, ప్రయివేటు ఆరోగ్య సదుపాయాల నెట్‌వర్క్‌లలో ఉచిత, నాణ్యమైన ఆస్పత్రి సేవలను మిగిలినవారితో సమానంగా పట్టణ, గ్రామీణ పేదలకు అందుబాటులోకి తెచ్చారు.

వ్యయాన్ని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ పర్యవేక్షణలో ప్రభుత్వ నిధుల నుండి భర్తీ (రీఇంబర్స్) ఏర్పాటుతో చెల్లిస్తారు. తీవ్ర అనారోగ్యాల వల్ల ఖర్చుల భారం నుండి పేదలకు ఆర్థిక భద్రత అందించటమే కాకుండా, డిమాండ్ వైపు నుండి నిధుల్ని సమకూర్చటం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్ని బలోపేతం చేయాలని కార్యక్రమం లక్షిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయాధారిత రాష్ట్రం అయినందున, సార్వత్రిక ఆరోగ్య కవరేజీకి, ముఖ్యంగా క్యాన్సర్, మూత్రపిండాల వైఫల్యం, గుండెజబ్బులు వంటి తీవ్ర అనారోగ్యాలకు దారిద్ర్యరేఖకు దిగువన (బి.పి.ఎల్) నివసించే వారికి ఆర్థిక కేటాయింపులు చేయటం రాష్ట్రం లోని పేదరిక స్థాయిలను ప్రభావితం చేసే కీలక నిర్ణాయ కాలలో ఒకటి.

ఈ కార్యక్రమానికి లబ్ధిదారులను పేదరిక రేఖకు దిగువన నివసించే కుటుంబాలకిచ్చే తెల్లరేషన్ కార్డుల ద్వారా గుర్తిస్తారు. రాష్ట్రంలోని 86% కుటుంబాలు బి.పి.ఎల్ రేషన్ కార్డుదారులని, కార్యక్రమం కింద ప్రయో జనాలను వినియోగించుకోవటానికి అర్హులని అంచనా.

లబ్ధిదారుల ప్రాథమిక ఎంపిక ఉచితంగా ఎ) పి.హెచ్.సి వద్ద వైద్య మిత్ర ద్వారా బి) పి.హెచ్.సి స్థాయిలో నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్య శిబిరాలు నిర్వహించే పద్ధతి ద్వారా సి) కార్యక్రమ సేవలలో భాగంగా నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్వహించే ఉచిత ఒ.పి స్క్రీనింగ్ ద్వారా చేస్తారు.

ఆరోగ్య శిబిరాల్లో రోగులను పరీక్షించి, సాధారణ ప్రాథమిక ఆరోగ్య సమస్యలు ఉంటే చికిత్స చేస్తారు. ద్వితీయ, తృతీయ స్థాయి చికిత్సల కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు (రెఫర్) చేస్తారు. చికిత్సకు ఆస్పత్రిని ఎంచుకునే అవకాశం రోగికి ఉంటుంది. అనారోగ్యాల బారిన పడకుండా పరిశుభ్రత పాటించటం, సాధారణ ఆరోగ్యం, సాంక్రమిక వ్యాధుల నివారణలపై ప్రదర్శనలు, దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించటం, నివారించటం వంటి కార్యకలాపాలను ఆరోగ్య శిబిరాల సమయంలో నిర్వహిస్తారు.

2008–2012 మధ్యకాలంలో, అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 30,000కి పైగా ఆరోగ్య శిబిరాల్ని నిర్వహించారు. వీటిల్లో సాధారణ అనారోగ్యాలను 52.3 లక్షల మందిలో గుర్తించగా, 2.4 లక్షల మందిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. సాధారణ ఆరోగ్యం పట్ల చైతన్యాన్ని పెంచటానికి, కార్యక్రమాన్ని ప్రచారం చేయటానికి కూడా ఆరోగ్య శిబిరాలు ఉపయోగపడ్డాయి.

ఆరోగ్య శిబిరాలు, ఓ.పి స్క్రీనింగ్, రోగ నిర్ధారణ పరీక్ష, చికిత్స, చికిత్సానంతర జాగ్రత్తలు, క్లెయిము చెల్లింపు వంటి అన్ని సేవల్లో దుర్వినియోగం లేదా అక్రమాలను నివారించటానికి ప్రక్రియ పారదర్శకంగా, వెబ్–ఆధారితంగా ఉంటుంది.

కార్యక్రమం వెలుపల ఉండే ప్రభుత్వ ఆస్పత్రులు అందించే సేవలను కార్యక్రమం గుర్తిస్తుంది, పేదల ఆస్పత్రి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చటానికి ప్రయత్నిస్తుంది.


2007–08లో సుమారు రూ.160 కోట్ల బడ్జెట్‌తో కార్యక్రమం ప్రారంభమైంది. క్రమంగా పెరుగుతూ 2011–12 నాటికి బడ్జెట్ రూ.1800 కోట్లకు చేరింది. 6 స్పెషాలిటీలలో గుర్తించిన 163 చికిత్సలకు వర్తిస్తూ ప్రారంభమైన కార్యక్రమం.. క్రమంగా 31 స్పెషాలిటీలలో 942 చికిత్సలకి విస్తరించింది. 2011–12లో క్యాన్సర్, గుండె జబ్బులు వంటి 29 స్పెషాలిటీలలో 942 చికిత్సలకు 380 నెట్‌వర్క్ ఆస్పత్రులలో చికిత్స అందించారు. తొలుత, ప్రతి బి.పి.ఎల్ కుటుంబానికీ సభ్యులందరికీ వర్తించే ఫ్లోటర్ ప్రాతిపదికన ఏడాదికి రూ.2 లక్షల ఆర్థిక కవరేజీని అందించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ కవరేజీని పెంచారు.

**మూలం:**

1. ఆంధ్రప్రదేశ్ వై.ఎస్.ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం వార్షిక నివేదికలు 2008–09, 2009–10, 2010–11, 2011–12.

2. డా॥ ఎన్.టి.ఆర్ వైద్య సేవపై ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ నివేదిక (ఎపిహెచ్ఆర్‌డిఐ.ఎపి.గవ్.ఇన్.పిడిఎఫ్)


SAY NO TO
Old Pension Scheme
REFUSE
IT DEFUSE
IT!
SCAN HERE TO
VOTE
WWW.REFUSEOPS.IN


Your future
is at risk
Listen to
Dr. Jayaprakash Narayana
talk about OPS &
its impending dangers
on www.refuseops.in
REFUSE
IT DEFUSE
IT!
OLD
PENSION
SCHEME
WATCH NOW
www.refuseops.in

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th January, 2023 Posting Date 15 &16th of every month



# HAPPY NEW YEAR 2024

FDR FOUNDATION *for* DEMOCRATIC REFORMS

## ఎన్నికల సంవత్సరం - 5 అంశాల ఎజెండా

- **ఆర్థిక ప్రగతి:** ఏ పార్టీ అయినా అనివార్యంగా ఆర్థికాభివృద్ధి చేయాలి, అప్పుచేసి పప్పుకూడు ఆపాలి, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలి
- **మాఫియా ధోరణుల్ని అరికట్టటం:** అధికారంలో ఉంటే ఏమైనా చేయొచ్చనే ధోరణుల్ని అరికట్టాలి, చట్టబద్ధపాలన, ప్రజల హక్కుల్ని కాపాడాలి
- **అభివృద్ధి వికేంద్రీకరణ - చిన్న పట్టణాల అభివృద్ధి:** వ్యవసాయం - పరిశ్రమలు, గ్రామీణ - పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తొలగించేందుకు ఎక్కడికక్కడ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి
- **అధికార వికేంద్రీకరణ - స్థానిక సాధికారత:** తమ ఓటు, పన్నుల డబ్బు వల్ల ఏం జరుగుతోందో ప్రజలకు అర్థమయ్యేందుకు స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో కూడిన అధికార వికేంద్రీకరణ అమలు
- **తుగ్లక్ తరహాలో విధానాలు మార్చకూడదు:** గతంలో ఉన్న మంచిని కొనసాగిస్తూ పొరపాట్లు సరిచేసి కొత్త పుంతలు తొక్కాలి తప్ప తుగ్లక్ లాగా గత ప్రభుత్వాల నిర్ణయాలన్నిటినీ మార్చేయకూడదు

ఇంగితజ్ఞానం, పరస్పర సహకారం, ఒకరి మీద ఒకరు ఆధారపడి ఉన్నామనే విజ్ఞత, మంచి రాజకీయం, మంచి పాలన 2024 లో సిద్ధిస్తాయని, మన పిల్లల ఔన్నత్యానికి, వచ్చే తరం భవిష్యత్తుకి బాటలు వేస్తామని ఆశిస్తూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్,**
**FDR, లోక్ సత్తా వ్యవస్థాపకులు**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020